


చర్లపల్లి-ధన్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల దృష్ట్యా చర్లపల్లి-ధన్‌పూర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 21 నుంచి 28 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ధన్‌పూర్-చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ (07792) ఈ నెల 20 నుంచి 28 వరకు, తిరుగు ప్రయాణంలో చర్లపల్లి-ధన్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (07791)ను ఈ నెల 21 నుంచి 28 వరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

ఉక్కు యాజమాన్యం అత్యుత్సాహం



మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభానికి తొందర

- ఆగస్టులో ప్రారంభించాల్సిందిగా కేంద్ర మంత్రి చెబితే... మార్చి నెలాఖరులో ముహూర్తం
- ముడిసరకుల కొనుగోళ్లలో కమీషన్ల కోసమేనా?
- మరమ్మతులు పూర్తికాకుండా నడపడం ఎలా?
- ఇంకా మారని ఉన్నతాధికారుల తీరు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం తీరు మారడం లేదు. చేయాల్సిన తప్పులన్నీ చేసేసి నష్టాలను కార్మికుల మీదకు నెట్టేస్తోంది. యాజమాన్యం వైఫల్యం వల్లనే స్టీల్‌ప్లాంటుకు ఈ దుస్థితి వచ్చిందని స్వయంగా విశాఖపట్నం ఎంపీనే ఇటీవల వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు కూడా యాజమాన్యం అదే విధానంలో ముందుకు వెళుతోంది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఆగస్టులో ప్రారంభించాలని కేంద్ర ఉక్కు శాఖా మంత్రి చెబితే...మార్చి నెలలోనే అందులో ఉత్పత్తికి ఆదరాబాదరాగా ఏర్పాట్లు చేస్తోంది. దానికి అవసరమైన ముడి సరకు కొనుగోళ్లలో వచ్చే కమీషన్ల కోసమే ఇదంతా చేస్తున్నారనేది కార్మిక వర్గాల ఆరోపణ.

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో ప్రస్తుతం రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మాత్రమే నడుస్తున్న సంగతి తెలిసిందే. ముడి సరకుల కొనుగోలుకు అవసరమైన నిధులు లేకపోవడం వల్లనే మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను చాలాకాలంగా ఆపేశారు. గతంలో సీఎండీగా పనిచేసిన అతుల్ భట్ కూడా నామమాత్రపు పనులతో 2023 డిసెంబరులో బ్లాస్ట్ ఫర్నేస్-3ను ప్రారంభించి మూడు నెలలు నడిపి ఆ తరువాత మళ్లీ మూసేశారు. సరైన నిర్వహణ పనులు చేపట్టకుండా ఉత్పత్తి ప్రారంభించడం వల్ల అందులో కూలింగ్ ప్లేట్లు పాడైపోయాయి. కొత్తవి తెప్పించి అమర్చి, ఆ తరువాత మిగిలిన నిర్వహణ పనులన్నీ పూర్తిచేస్తే తప్ప అందులో ఉత్పత్తి మొదలు పెట్టడం సాధ్యం కాదు. ఇవన్నీ చేయాల్సి ఉందనే కారణంతోనే ఆగస్టులో దానిని ప్రారంభించాలని ... మిగతా 6వ పేజీలో



ఉక్కు యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇచ్చేందుకు ర్యాలీగా వెళుతున్న కార్మికులు

7న కాంట్రాక్టు కార్మికుల సమ్మె

స్టీల్‌ప్లాంటు యాజమాన్యానికి నోటీస్

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 7న సమ్మె చేపట్టేందుకు స్టీల్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు సిద్ధమయ్యారు. ఈ మేరకు గురువారం అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ర్యాలీగా వెళ్లి యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందజేశారు. ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించరాదని, టెండర్‌లు ముగిసిన కాంట్రాక్టర్‌ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి కల్పించాలని, పాత పద్ధతిలోనే గేటుపాస్‌లు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లింపులో సమస్యలు లేకుండా చూడాలనే డిమాండ్‌లతో సమ్మె చేపట్టనున్నట్టు నోటీస్‌లో పేర్కొన్నారు. ర్యాలీలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు మంత్రి రవి, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, కృష్ణా, అప్పారావు, తదితరులు ఉన్నారు.

చేతులు మారుతున్న తహశీల్దార్ భూములు!

గత నెల రెండో తేదీన 43 మ్యుటేషన్లు

- అన్నీ పులగానిపాలెం గ్రామానికి చెందినవే...
- ఎవరు చేశారు...?, ఎవరికి చేశారు...?
- వెబ్‌ల్యాండ్‌లో వివరాలు
- అటువంటిదేమీ లేదంటున్న పెందుర్తి ప్రస్తుత తహశీల్దార్ ఆనంద్‌కుమార్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెందుర్తి మండలంలో రిటైర్డ్ తహశీల్దార్ ఖాతా నంబర్‌పై ఉన్న భూములు చేతులు మారుతున్నాయి. ఆయన మరణించిన తరువాత ఆ ఖాతాలో భూములకు మ్యుటేషన్లు (రెవెన్యూ రికార్డుల్లో ప్రాపర్టీ టైటిల్ మార్పు) జరుగుతున్నాయి. అవన్నీ ఎవరు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రస్తుత తహశీల్దార్ ఆనందకుమార్ మాత్రం ఎటువంటి మ్యుటేషన్లు జరగలేదని అంటున్నారు. కానీ వెబ్‌ల్యాండ్‌లో లాలం సుధాకర్‌నాయుడు ఆధార్ నంబర్‌తో లింక్ అయి ఉన్న 9102 ఖాతా నుంచి 2025 జనవరి రెండో తేదీన సుమారు 43 మ్యుటేషన్లు జరిగాయి. వీటిని అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.



పెందుర్తి ఎమ్మార్వో కార్యాలయం (ఇన్‌సెట్‌లో) సుధాకర్ నాయుడు (ఫైల్)

గత ఏడాది అక్టోబరులో రిటైర్డ్ తహశీల్దార్ లాలంసుధాకర్‌నాయుడు మృతిచెందారు. రెవెన్యూ రికార్డులోకుటుంబ సమాచారం తీస్తే ఆయన ఇంకా బతికే ఉన్నట్టు చూపిస్తోంది. రికార్డులు అప్‌డేట్ కాలేదని అధికారులు అంటున్నారు. ఏదైనా భూమి మ్యుటేషన్ జరగాలంటే (కొత్త వ్యక్తి పేరు మీదకు ఆస్తి మారాలంటే) అప్పటివరకూ ఎవరి పేరుతో ఆ భూమి ఉందో ఆయన ఆధార్, మొబైల్ నంబర్ అవసరం. మ్యుటేషన్ దరఖాస్తు ప్రాసెస్‌లో భాగంగా ఆ మొబైల్ నంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వెళుతుంది. దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సుధాకర్ నాయుడు చనిపోయిన తరువాత ఆ మొబైల్ తాము వాడడం లేదని ఆయన సోదరుడు ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆ మొబైల్‌కు ఎటువంటి ఓటీపీలు రావడం లేదని కూడా చెప్పారు. అలాగైతే సుధాకర్‌నాయుడు ఆధార్ నంబర్‌తో లింక్ అయి ఉన్న పులగానిపాలెం (పెందుర్తి మండలం) భూములు ఈ ఏడాది రెండో తేదీన మ్యుటేషన్ ఎలా జరిగాయనేది తెలియాల్సి ఉంది. చనిపోయిన రిటైర్డ్ తహశీల్దార్ పేరుతో ఉన్నది నోషనల్ ఖాతాయే అనుకున్నా...అందులో కొన్ని భూములకు మ్యుటేషన్ చేయాల్సి వస్తే...ఏ విధంగా ముందుకు వెళ్లాలో ఉన్నతాధికారులను అడిగి చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ జిల్లా కేంద్రంలో ఉన్న అధికారుల దృష్టికి తేకుండానే మండల స్థాయిలో జరిపించేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మ్యుటేషన్ దరఖాస్తు పరిశీలించినప్పుడు సుధాకర్‌నాయుడి పేరుతో చాలా భూములు ... మిగతా 6వ పేజీలో

గ్రూప్-2 పరీక్షకు 16 కేంద్రాలు



- 23వ తేదీ ఉదయం, మధ్యాహ్నం నిర్వహణ
- అభ్యర్థులు 11,029 మంది
- ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని
- కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచన

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న జిల్లాలోని 16 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ఏపీపీఎస్సీ అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. పరీక్షలు రెండు పూటలు జరుగుతున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు ముందురోజే కేంద్రాలకు చేరుకుని ఏర్పాట్లు పరిశీలించాలన్నారు.

జిల్లాలోని 16 కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 11,029 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం పరీక్ష రాసే అభ్యర్థులను 8.30 నుంచి 9.30 గంటల వరకూ, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకూ పరీక్ష హాలులోకి అనుమతించాలన్నారు. అయితే 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందన్నారు. ఉదయం 9.45, మధ్యాహ్నం 2.45 గంటల తరువాత వచ్చే అభ్యర్థులకు అనుమతించేది లేదని స్పష్టంచేశారు.

చీఫ్ సూపరింటెండెంట్లు, ఏపీపీఎస్సీ అధికారులు తప్ప ఇతర సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకురాకూడదన్నారు. కేంద్రాలకు సమీపంలో జెరాక్స్ సెంటర్లు మూసివేయించాలని, దివ్యాంగులకు స్క్రైబ్స్‌ను ... మిగతా 6వ పేజీలో

వీడిన మిస్టరీ

పెందుర్తి జ్యోతిష్కుడు అప్పన్న హత్య కేసులో దంపతుల అరెస్టు

- భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే కక్షతోనే అంతమొందించాడు
- ఆనవాళ్లు దొరక్కుండా శవాన్ని కాల్చేందుకు యత్నం



అప్పన్న దొర (ఫైల్)

భీమునిపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెందుర్తికి చెందిన జ్యోతిష్కుడు మోతి అప్పన్న దొర హత్య కేసును భీమిలి పోలీసులు ఛేదించారు. సంఘటన వెలుగులోకి వచ్చిన 24 గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి గురువారం రాత్రి భీమిలి సీఐ బొడ్డేపల్లి సుధాకర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి బీసీ కాలనీకి చెందిన అప్పన్నదొర ఊరూరా తిరుగుతూ పూజలు చేస్తుంటాడు. ఈనెల తొమ్మిదో తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చిన అప్పన్నదొర తిరిగి వెళ్లకపోవడంతో మరుసటిరోజు ఆయన కుమారుడు దుర్గాప్రసాద్ ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో బుధవారం కాపులుప్పాడ సమీపంలోని ఒక లేఅవుట్‌లో శవాన్ని కాల్చిన ఆనవాళ్లు కనిపించాయి. అక్కడ లభించిన వస్తువులను బట్టి అది తన తండ్రిదేనని దుర్గాప్రసాద్ గుర్తించాడు. ఈ కేసులో భీమిలి మండలం నేరేళ్లవలసకు చెందిన ఊళ్ల చిన్నారావు దంపతులను నిందితులుగా గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు.

ఏం జరిగిందంటే...

నేరేళ్లవలస ప్రాంతానికి చెందిన చిన్నారావు దంపతులు నెల క్రితం ఆనందపురం మండలం ఎల్.వి.పాలెంలో అద్దెకు దిగారు. వారికి ఇంటి సమీపంలో ఉండే టీ దుకాణం యజమాని యెడ్ల తిరుపతమ్మతో పరిచయం ఏర్పడింది. ఆ టీ దుకాణం వద్దకు ప్రతి మంగళ, ఆదివారాల్లో అప్పన్న దొర వెళుతుండేవాడు. అతను సమస్యల నుంచి ఉపశమనం కోసం పూజలు చేస్తుంటాడని చిన్నారావు భార్య తెలుసుకుంది. తనకు సమస్యలు ఉన్నట్టు చెప్పడంతో పూజలు చేస్తానని ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడమేగాక, బలవంతంగా లోబరుచుకున్నాడు. ఆ విషయం ఎవరితోనైనా చెబితే కుటుంబాన్ని నాశనం చేస్తానని బెదిరించాడు. ఆమె ఈ విషయాన్ని తన భర్త చిన్నారావుకు తెలియజేసింది. ఈ నేపథ్యంలో అప్పన్నను హత్య చేసేందుకు ఇరువురూ పథకాన్ని రచించారు. అందుకోసం ఒక బటన్ నైఫ్‌ను సిద్ధం చేసుకున్నారు. అనంతరం తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని పూజ చేయాలని, అందుకు సంభావనగా రూ.7 వేలు ఇస్తానని అప్పన్నకు చిన్నారావు ఫోన్ చేశాడు. ఈ నెల 9న అప్పన్న ఆనందపురం రాగా...తన తల్లి ఉప్పాడలో ఉంటుందని, అక్కడకు తీసుకువెళతానంటూ పల్సర్ బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. బోయపాలెం మీదుగా కాపులుప్పాడ నుంచి చేపలుప్పాడ వెళ్లే గ్రావెల్ రహదారిలోకి తీసుకువెళ్లాడు. మార్గమధ్యంలో గంభీరం గెడ్డ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ లేఅవుట్‌లో గల షెడ్డు వద్దకు తీసుకువెళ్లి అప్పన్నను చిన్నారావు ... మిగతా 6వ పేజీలో

నాలా పన్ను బకాయిలు రూ.930 కోట్లు

విశాఖ డివిజన్‌లో రూ.870 కోట్లు, భీమిలి డివిజన్‌లో రూ.60 కోట్లు

- మెడ్‌టెక్ జోన్ చెల్లించాల్సింది రూ.786 కోట్లు
- బకాయిదారుల జాబితాలో రియల్ ఎస్టేట్ కంపెనీలు, భవన నిర్మాణ సంస్థలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్) పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వ్యవసాయ భూములను ఇతర అవసరాలకు వినియోగించుకోవాలంటే నాలా పన్ను చెల్లించాలి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో నాలా పన్ను బకాయిలు రూ.930 కోట్లు వరకూ ఉన్నాయి. విశాఖ రెవెన్యూ డివిజన్ పరిధిలో రూ.876.05 కోట్లు, భీమిలి డివిజన్‌లో రూ.60 కోట్ల వరకూ రావలసి ఉన్నట్టు గుర్తించారు. విశాఖపట్నం రెవెన్యూ డివిజన్‌లో 540 ఎకరాలకు సంబంధించి 120 మంది వ్యక్తులు/సంస్థలు/కంపెనీలు నాలా పన్ను చెల్లించాల్సి ఉంది. డివిజన్‌లో మొత్తం బకాయిలో 84 శాతం...అంటే సుమారు రూ.786.14 కోట్లు పెదగంట్యాడ మండలం నడుపూరులో 270.71 ఎకరాల్లో నెలకొల్పిన మెడ్‌టెక్ జోన్ యాజమాన్యం చెల్లించాల్సి ఉంది. వాస్తవంగా మెడ్‌టెక్ జోన్ బకాయి రూ.390 కోట్లు ఉండగా రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులకు సదరు యాజమాన్యం స్పందించలేదు. దీంతో 100 శాతం పెనాల్టీ విధించడంతో బకాయి రూ.786.14 కోట్లకు చేరింది. కాగా మిగిలిన బకాయిదారుల్లో చిన్న వ్యాపార సంస్థలు, రియల్ ఎస్టేట్ కంపెనీలు, భవన నిర్మాణ సంస్థలు ఉన్నాయి. భీమిలి డివిజన్‌లో రూ.60 కోట్లు రావలసి ఉంది. బకాయిల వసూళ్లకు జిల్లా యంత్రాంగం కసరత్తు ... మిగతా 6వ పేజీలో

మాజీ ముఖ్యమంత్రి జగన్ ట్రాన్సిట్ హాల్ట్



మాజీ సీఎం జగన్‌ను కలిసిన గుడివాడ అమర్, బొడ్డేడ ప్రసాద్, కరణం ధర్మశ్రీ, విజయ్‌ప్రసాద్

గోపాలపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లా పాలకొండ వెళుతూ కొద్దిసేపు విశాఖపట్నం విమానాశ్రయంలో ఆగారు. ఆయన తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు విశాఖపట్నం చేరుకున్నారు. విమానాశ్రయంలోని వీపీఐ లాంజ్‌లో జగన్మోహనరెడ్డిని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేశ్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, తదితరులు కలిశారు. అనంతరం మధ్యాహ్నం 1.20 గంటలకు ఆయన హెలికాప్టర్‌లో పాలకొండ వెళ్లారు. పాలకొండ నుంచి తిరిగి సాయంత్రం ఐదు గంటలకు విశాఖ చేరుకున్న జగన్మోహనరెడ్డి...ఆరు గంటలకు విమానంలో బెంగళూరు బయలుదేరి వెళ్లారు.



పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ సన్నిధిలో పూజలు చేస్తున్న ఈవో శేఖర్‌బాబు తదితరులు

దుర్గాలమ్మకు తమలపాకులతో అర్చన

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ ప్రాంతంలోని దుర్గాలమ్మ అమ్మవారికి గురువారం తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఇందుకోసం బంగ్లా తమలపాకులు 16 వేలు, సాదా ఆకులు 15 వేలు, ఇతర ఆకులు, పువ్వులు వినియోగించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి పైలా శేఖర్‌బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతిపై విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి బదిలీ

గోపాలపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి పదోన్నతిపై బదిలీ అయ్యారు. సుమారు ఏడాదిన్నరగా ఇక్కడ పనిచేస్తున్న రాజారెడ్డిని ప్రభుత్వం బీహార్‌లోని దర్భంగా విమానాశ్రయం జనరల్ మేనేజర్‌గా నియమించింది. విశాఖ విమానాశ్రయం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఎస్.పురుషోత్తమ్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- తహశీల్దార్లను ఆదేశించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ - 8లో

అప్పన్నకు సంప్రదాయబద్ధంగా స్వర్ణపుష్పార్చన



స్వర్ణపుష్పాల నడుమ స్వామివారు

సింహాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం వైభవంగా స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరుల సహితంగా సర్వాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆలయ భాండాగారం నుంచి స్వర్ణ సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామాలను పఠిస్తూ ప్రతినామానికి స్వర్ణ సంపెంగలతో పూజలు చేపట్టారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఆభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు.స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

తగరపువలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు పరిధిలో శుక్రవారం కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాక ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంకు కాలనీ, తాతాజీనగర్, ఎల్లంపేట, మహాలక్ష్మిపురం, డెక్కతిపాలెం, రాజలింగంపేట, రేఖవానిపాలెం రాయిపాలెం, మరడపాలెం మూలకుద్దు తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. చెట్ల కొమ్మలను తొలగింపు, ఇతర నిర్వహణ పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో జానకి

ఆనందపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వెల్లంకిలో గృహ నిర్మాణాలను ఎంపీడీవో జానకి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి మంజూరైన 2,684 గృహాలలో 1,219 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. ఈ నెల 25లోగా ప్రస్తుత పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సహాయకులను ఆదేశించారు. పంచాయితీ విస్తరణాధికారి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తగరపువలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని ట్రాన్స్‌కో (ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. 2వ వార్డు పరిధిలోని బాంకు కాలనీ, తాతాజీనగర్, ఎల్లంపేట, మహాలక్ష్మిపురం, డెక్కతిపాలెం, రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయిపాలెం, మరడపాలెం, మూలకుద్దు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్ల పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆవుకు శస్త్రచికిత్స చేసి 50 కిలోల ప్లాస్టిక్ తొలగింపు

ఆనందపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశు వైద్యశాలలో గురువారం ఆవుకు శస్త్రచికిత్స చేసి 50 కేజీల వరకు ప్లాస్టిక్‌ను బయటకు తీశారు. వేములవలసకు చెందిన కోరాడ నాయుడుబాబు ఆవు ఐదు రోజుల నుంచి మేత మేయడం లేదు. పడుకునేందుకు ఇబ్బంది పడింది. కడుపు నొప్పితో బాధపడుతుండడంతో పశు వైద్యుల్ని సంప్రదించారు.

డాక్టర్ అనీల్‌కుమార్ ఆ ఆవును పరిశీలించి శస్త్రచికిత్స చేశారు. పొట్టలో నుంచి 50 కేజీల వరకు ప్లాస్టిక్ కవర్లు, తాళ్లు తీశారు. ప్లాస్టిక్ తింటున్న మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని, రైతులు జాగ్రత్తగా ఉండాలని అనీల్‌కుమార్ సూచించారు. పశువైద్య సిబ్బంది సుజాత, దుర్గలక్ష్మి, రమణ, సంతోష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోసం చెరువు స్థలం పూడ్చివేత

» అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



శిల్పారామంలో చెరువు స్థలంలో మట్టి వేసి పగోడా సమీపంలో ఏర్పాటు చేసిన రహదారి

మధురవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక ప్రాంతం శిల్పారామంలో పీపీపీ పద్ధతిలో రెండు కల్యాణ మండపాలు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియలో చేపట్టిన పనుల్లో కొంతమేరకు చెరువు స్థలం మట్టితో పూడ్చివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సహజసిద్ధంగా ఉన్న చెరువు స్థలం పూడ్చితే భూగర్భ జలాల పరిరక్షణ ఎలా సాధ్యమవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ చెరువులో బోట్‌క్లబ్ కూడా ఉండేది. కాలక్రమంలో చెరువులో నీరు ఎండిపోవడంతో అది మూతపడింది. అభివృద్ధి పనులు పర్యావరణ పరిరక్షణ సహితంగా ఉండాలి తప్ప ఇలా ఇబ్బందిగా చేపడితే ఎలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే అభివృద్ధి పనులు కొనసాగించాలని పర్యావరణ ప్రియులు, ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు.

రహదారి కోసమే..

చెరువు స్థలం కొంతమేరకు పూడ్చివేయడంపై శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డిని వివరణ కోరగా కల్యాణ మండపాలు సమీపంలో పగోడాలు (పర్యాటకులు కూర్చునే స్థలాలు) ఉన్నాయని, వాటికి రహదారి కోసం చెరువు స్థలం కొంతమేరకు పూడ్చివేసినట్టునట్టు చెప్పారు.

పేద విద్యార్థికి హెచ్ఎం సైకిల్ వితరణ

» మరికొందరిని దాతలు ఆదుకోవాలంటూ వినతి



విద్యార్థి చైతన్యకు సైకిల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం కంచేరుపాలెం నుంచి చిప్పాడ ఉన్న తపాఠశాలకు నాలుగు కిలోమీటర్లు ప్రతిరోజూ నడుచుకొని వచ్చి చదువుకుంటున్న 8వ తరగతి విద్యార్థి ముగడ చైతన్యకు ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంవీటీ రత్నం సైకిల్‌ను అందజేశారు. సైకిల్‌ను తన సొంత డబ్బులతో కొన్న హెచ్ఎం గురువారం ఉపాధ్యాయుల అందరి సమక్షంలో సైకిల్‌ను చైతన్యకు అందజేశారు.

తండ్రి లేని ఈ విద్యార్థి ఖాళీ సమయంలో కూలి పనులకు వెళుతూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఈ విషయం తెలిసి ఈ సాయం చేయాలనిపించిందని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం రత్నంను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థి చైతన్య కృతజ్ఞతలు తెలిపాడు.

కాగా, గతంలో ఈ పాఠశాలలో బాలికలకు దివీస్ యాజమాన్యం సైకిళ్లను అందించింది. కానీ అవి పాడైపోయి నిరుపయోగంగా మారాయి. ఈ ఏడాది కూడా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఆ కంపెనీ నిబంధనల ప్రకారం మగపిల్లలకు సైకిళ్లకు ఇవ్వడం కుదరడం లేదు. చాలామంది బాలురు అన్నవరం వంటి దూర ప్రాంతాల నుంచి ఆటోలపై స్కూలుకు వస్తున్నారని, దీంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారని హెచ్ఎం పేర్కొన్నారు. దాతలు ఎవరైనా ఇటువంటి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేక అప్పారావు, ఎస్.విజయకుమారి, సునీల్‌కుమార్, ఆర్ .త్రివేణి, ఆర్ రాజేశ్వరి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం ప్రథమ వార్షికోత్సవం



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

మధురవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వవార్డు పరిధిలోని పిల్లకోమటివానిపాలెంలో ఉన్న శ్రీరామాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచి ఆలయంలో సీతారామచంద్రస్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విజ్ఞీస్ ఫౌండర్ అధినేత తలశిల విజయ్‌మోహన్ ఆర్థిక సహాయంతో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు టీడీపీ పరిశీలకులుగా దుర్గారావు, ఆనందబాబు



దుర్గారావు



ఆనందబాబు

మధురవాడ/ కొమ్మాది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మాడుగుల నియోజకవర్గం టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, మధురవాడకు చెందిన మామిడి దుర్గారావు, నర్సీపట్నం నియోజకవర్గానికి గొల్లంగి ఆనందబాబు నియమితులయ్యారు. తమకు అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా నిర్వహించి కూటమి అభ్యర్థి రఘువర్మ గెలుపునకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

గోకులాలకు ప్రోత్సాహాలకు అందించాలని
మంత్రి నారా లోకేశ్‌కు వినతి

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలంలో వివిధ గ్రామాల్లో పశువుల పెంపకం, పోషణ వంటి కార్యక్రమాలను చేపడుతున్న గోకులాలకు ప్రోత్సాహాలను అందించాలని పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్, జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు గురువారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. మినీ డెయిరీల మాదిరిగా నడుస్తున్న వీటిని పశుసంవర్థక శాఖ ఏర్పాటు చేసిందని, వీటిని ప్రోత్సహిస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పాడి పశువుల కొనుగోలుకు రుణాలను అందించడంతో పాటు పాలకు గిట్టుబాటు ధరలను అందించాలని కోరారు.

ఎన్ని గోకులాలు ఏర్పాటయ్యాయి వాటి పరిస్థితి ఎలా ఉందన్న విషయాలను లోకేష్ నాయకుల్ని అడిగి తెలుసుకున్నారని వెంకటప్పుడు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపురానికి చెందిన గాడు తాతినాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువుల సంరక్షణపై అధికార బృందం పరిశీలన



గంభీరంగెడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఇతర అధికారులు

విశాఖపట్నం/భీమునిపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాపులుప్పాడలో గొలుసు కట్టు చెరువుల సంరక్షణపై చేపడుతున్న పనులను వీఎంఆర్‌డీఏ కమిషనరు కెఎస్ విశ్వనాథన్ కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ, ఇరిగేషన్, ధాన్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి గురువారం పరిశీలించారు. కాపులుప్పాడలో ప్రవహిస్తున్న గంభీరం గెడ్డ, మారికవలస తదితర ప్రాంతాల్లో వివిధ కంపెనీల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలతో కలుషితమవుతుందని రైతులు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గంభీరం గెడ్డపై నురగలు కక్కుతున్న గెడ్డనీటిని పరిశీలించారు. ఈ నీటితో భూగర్భ జలాలు కలుషితమవుతాయని, చెరువు గర్భాలు దెబ్బతింటాయని, అందువల్ల సంబంధిత విభాగాల వారు సమగ్రంగా పరిశీలించి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మొక్కల పెంపకానికి గల అవకాశాలను పరిశీలించారు. అనంతరం నిడిగట్టు, జెవి అగ్రహారం, కొత్తవలసలో ల్యాండ్ పూలింగ్ చేసిన రైతులకు అందిస్తున్న ఆర్‌సి లే అవుట్‌లను, మౌలిక వసుతుల కల్పన పనులను పరిశీలించారు. మార్చి 31లోగా తారురోడ్డు పనులు పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడొద్దని గుత్తేదారులు, అధికారులకు సూచించారు. కె.నగరపాలెం తెలుగు రైతు పోతిన అప్పలరాజు గెడ్డ కాలుష్యంపై మెట్రోపాలిటన్ కమిషనర్‌తో మాట్లాడుతూ మంచినీటి బోర్ వెల్స్, పంటలు పాడవుతున్నాయని, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

పనులు వేగంగా పూర్తి చేయండి

ఎండాడలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆయన ఎండాడలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులను పరిశీలించారు. ఎన్నికల నియమావళి ముగిసిన వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బోయపాలెం-నగరపాలెం బృహత్ ప్రణాళిక రహదారి పనులను, టీడీఆర్‌ల సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. జల సంరక్షణ, గొలుసుకట్టు చెరువులను సంరక్షించే చర్యల్లో భాగంగా కాపులుప్పాడ చెరువును కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో జీవీఎంసీ, ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులతో సందర్శించారు. తదుపరి నిడిగట్టు, కొత్తవలస, రెడ్డిపల్లి, జయంతివాని అగ్రహారం గ్రామాల్లో ఆర్‌సీ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీశంకర్, బలరామరాజు, కార్య నిర్వాహక ఇంజినీర్లు, స్థానిక ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

స్మరణతోనే భగవంతుని కరుణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

సింహాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్మరణతోనే భగవంతుని కరుణ పొందవచ్చని సింహాచల దేవస్థానం హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టీపీ రాఘవాచార్యులు అన్నారు. భగవద్రామానుజ దాస బృందం ప్రతినిధి కందాడై రాజగోపాలాచార్యులు ముద్రించిన 'శ్రీమన్నారాయణ వైభవమ్' అనే పుస్తకాన్ని సింహగిరిపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాలయ ప్రధానార్చకులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో సింహాచల దేవాలయ ప్రధాన మూర్తికి సంబంధించిన వరాహ, నారసింహ, సింహగిరిపై ఉన్న గంగధార సమీపం సీతారామస్వామివార్ల స్తుతిని పొందుపరిచారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణమూర్తి, విశ్రాంత ప్రధానార్చకులు కేకేటీ ఆచార్యులు, టీపీ దాశరథి, పర్యవేక్షణాధికారి జీవీవీఎస్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నప్రసాద పథకానికి విరాళం



విరాళం బాండును దాతకు ఇస్తున్న అధికారులు

సింహాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి అనకాపల్లికి చెందిన తొగరు అక్కయ్య విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను నగదు రూపంలో గురువారం అన్నప్రసాద విభాగ సిబ్బందికి అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం చేయించి, శేషవస్త్రంతో సత్కరించారు. వేదాశీర్వచనం, ప్రసాదాలను వారికి అధికారులు అందజేశారు.

అత్యవసర సేవలపై పోలీసులకు శిక్షణ



సీపీఆర్ చేయడంపై పోలీసులకు శిక్షణ ఇస్తున్న వైద్యులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవలు అందించే విషయంలో హైవే పెట్రోలింగ్ పోలీసులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఆర్మ్‌డు రిజర్వ్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కైలాసగిరిలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా నేషనల్ హైవేలో రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు బాధితులకు తక్షణ సహాయానికి అవసరమైన ప్రథమ చికిత్స, సీపీఆర్ చేయడం, అత్యవసర పరిస్థితులలో దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి బాధితులను వేగంగా తరలించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పోలీసు యూనిట్ డాక్టర్ తబస్సుంఅరా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మన్మధరావు, రామకృష్ణారావు, సంజీవరావు, ఆర్ఎస్ఐ ఆదినారాయణ, ఆసుపత్రి సిబ్బంది, హైవే పెట్రోలింగ్ వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. శుక్రవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగనుంది.

గీతంలో 900 మందికి శిక్షణ

గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ద్వారా ఎలా సహాయ పడవచ్చునో తెలియజేస్తూ గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఎమర్జెన్సీ మెడిసిన్ ఎస్‌బీఎమ్‌ఈ విభాగం 900 మందికి శిక్షణ ఇచ్చిందని విభాగం అధిపతి డాక్టర్ దివ్యబన్నా వెల్లడించారు. అంబులెన్సు డ్రైవర్‌లు, నర్సింగ్, ఆక్సిజన్ ప్లాంట్, ఫార్మసీ, ఆతిథ్య విభాగం, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సిబ్బంది, విద్యార్థులకు ఈ శిక్షణ అందించినట్లు ఆమె తెలిపారు. మరో 900 మందికి శిక్షణ ఇస్తామన్నారు. గీతంలోని సిమ్యులేషన్ ఆధారిత వైద్య విద్యా విభాగం నిపుణులు డాక్టర్ స్వర్ణలత, దివ్యవాణిల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి వీరిని అభినందించారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రాణదానం చేయాలని సూచించారు.

మహిళను ఢిల్లీ సీఎంగా ప్రకటించడం గర్వకారణం



మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నేతలు

కొమ్మాది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ వంటి రాష్ట్రానికి మహిళను ముఖ్యమంత్రిగా నియమించటం అభినందించదగ్గ విషయమని బీజేపీ సీనియర్ నాయకుడు కేవీసీ చక్రవర్తి అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ మహిళలకు ఇచ్చే గౌరవమన్నారు.

తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రేఖా గుప్తా ఢిల్లీ యూనివర్సిటీలో ఏబీవీపీ కార్యదర్శిగా, యూనివర్సిటీ అధ్యక్షురాలు వంటి కీలక పదవుల్లో పని చేశారన్నారు. దీన్నిబట్టి మహిళలకు బీజేపీ ఎంత ప్రాధాన్యం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు, నేతలు ఆర్ఎస్ఎన్ రాజు, పెండ్యాల శ్రీనివాస్, చంద్రశేఖరరాజు, ఫణీంద్ర, సత్యసాయి, షణ్ముఖరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాపోలమాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు

ఆరిలోవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల బీఎన్ఆర్ నగర్‌లో వెలసిని దుర్గాపోలమాంబ అమ్మవారి ఏడో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుఅమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, 10వ వార్డు కార్పొరేటర్ మద్ది రామలక్ష్మీరాజశేఖర్, నేతలు ఒమ్మి పోలారావు, బుడుమూరు గోవింద్, గాడు అప్పలనాయడు, మద్దిల రాజేశ్, బలగ సుధాకర్ పాల్గొన్నారు.

స్టార్ హోటళ్లలో అగ్ని ప్రమాదాల నివారణపై సదస్సు

మహారాణిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాల నివారణ (ఫైర్ సేఫ్టీ మీట్)పై గురువారం హోటల్ గ్రీన్ పార్కులో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, టూరిజం ఫోరం సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. చీఫ్ ఇంజనీర్లు, నగరంలోని స్టార్ హోటళ్ల సెక్యూరిటీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు హోటళ్లలో బస చేసిన అతిథులు, సిబ్బంది రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సుమారు 60 మంది వివిధ హోటళ్ల ప్రతినిధులు హాజరుకాగా వారికి విశాఖ జోన్ చైర్మన్ ఎంవీ పవన్ కార్తీక్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు.

గ్రూప్-2 పరీక్షకు 16 కేంద్రాలు

... 5వ పేజీ తరువాయి

అనుమతించాలని, వారిని కూడా తనిఖీ చేయాలన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని, నిర్ణీత సమయంలోగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒరిజినల్ ఓఎంఆర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు అందజేసి కిందనున్న డూప్లికేట్ పత్రాన్ని మాత్రమే తీసుకువెళ్లాలన్నారు. పరీక్షకు ఐదు నిమిషాల ముందు మాత్రమే సీల్డు కవర్‌లో ఉన్న ప్రశ్నపత్రాలను ఓపెన్ చేసి అభ్యర్థులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఏడీసీపీ రాజ్‌కమల్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ అశోక్, తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం తొలుత అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీపీఎస్సీ చైర్మన్ ఎ.ఆర్.అనురాధ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షకు సంబంధించి పలు మార్గదర్శకాలు జారీ చేశారు.

వీడిన మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

కత్తితో పొడిచి హతమార్చాడు. ఈ సందర్భంలో ఇరువురి మధ్య జరిగిన పెనుగులాటలో చిన్నారావు చూపుడు వేలికి గాయమైంది. కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందాడు. తిరిగి మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు పెట్రోల్ తీసుకుని భార్యతో కలిసి ఆరు గంటలకు ఆ లేఅవుట్ వద్దకు వెళ్లాడు. అప్పన్న శవంపై పెట్రోల్ పోసి నిప్పంటిం చాడు. అప్పన్నను హతమార్చిన చిన్నారావును, నేరం చేయడానికి సహకరించి సాక్ష్యాలను తారుమారు చేయడానికి యత్నించినందుకు అతడి భార్యను గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి నైఫ్, రక్తపు మరకలు కలిగిన నిందితుడి జీన్స్ ప్యాంటు, అప్పన్న ఫోన్ పౌచ్, లైటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సుధాకర్ తెలిపారు.

చేతులు మారుతున్న 'తహశీల్దార్' భూములు!

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయనే విషయం అక్కడి తహశీల్దార్‌కు వీఆర్‌ఓ చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. ఇక్కడ అది కూడా జరగలేదు. ఒకే రోజు...ఒక వ్యక్తి పేరు మీద ఉన్న భూములు 43 పద్దుల ద్వారా మ్యుటేషన్ చేయడం అంటే...తప్పకుండా లోతుగా విచారణ చేపట్టాల్సి ఉంటుంది.

కానీ అది కూడా చేయలేదు. కనిపించిన భూమినంతా నోషనల్ ఖాతా పేరుతో నమోదు చేసేసి, ఆ తరువాత తాపీగా ఎవరు క్లెయిమ్ చేసుకుంటే వారి పేర్ల మీద మ్యుటేషన్ చేస్తున్నారా?...అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ అదే జరిగితే ఇది భారీ కుంభకోణమే అవుతుంది. మండలాధికారులు అంతా కలిసి చేస్తున్నట్టుగానే భావించాల్సి ఉంటుంది.

నాలా పన్ను బకాయిలు రూ.930 కోట్లు

... 5వ పేజీ తరువాయి

చేస్తోంది. నోటీసులు జారీచేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ పెట్టే యోచనలో యంత్రాంగం ఉంది.

నాలా పన్ను ఐదు శాతం

వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాలకు వినియోగించు కోవాలంటే ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ విలువలో ఐదు శాతం నాలా పన్ను కింద చెల్లించాలి. స్థానిక సంస్థలు అంటే జీవీఎంసీ, గ్రామ పంచాయతీల అధికారులు ఆయా వ్యక్తులు/సంస్థలకు పలు రకాల అవసరాలకు అనుమతి ఇచ్చేముందే నాలా పన్ను చెల్లించారా?, లేదా?...అనేది తప్పనిసరిగా పరిశీలించాలి. కానీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భవన నిర్మాణదారులతో కుమ్మక్కై చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

ఉక్కు యాజమాన్యం అత్యుత్సాహం

... 5వ పేజీ తరువాయి

కేంద్ర మంత్రి కుమారస్వామి చెప్పారు. అయితే ఇక్కడే యాజమాన్యం సొంత ఆసక్తి బయటపడింది. ప్రస్తుత సీఎండీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆర్ఐఎన్ఎల్‌కు సీఎండీగా శక్తిమణిని కమిటీ ఇప్పటికే ఎంపిక చేసింది. ఆయన ఏప్రిల్‌లో ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. ఈలోగా బ్లాస్ట్ ఫర్నేస్-3ను ప్రారంభించేసి, దానికి అవసరమైన కోక్, పెల్లెట్లను వేల టన్నుల్లో కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్నారు. ఆగస్టులో ప్రారంభించాల్సి ఉండగా, మార్చి నెలాఖరు నాటికే ఉత్పత్తికి సిద్ధం చేస్తున్నారు. కూలింగ్ ప్లేట్లు కొత్తవి చైనా నుంచి తెప్పిస్తున్నట్టు తెలిసింది. అవి అమర్చేసి, ఉత్పత్తి ప్రారంభించాలని అనుకుంటున్నారు. మిగిలిన నిర్వహణ పనులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఈ విధంగా చేస్తేమూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో బ్లాస్ట్ ఫర్నేస్-3లో మళ్లీ పెద్ద సమస్య తలెత్తే ప్రమాదం ఉందని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. మరమ్మతులు చేయడానికి వందల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంటున్నాయి. కార్మికులే సరిగ్గా నడపలేక దానిని పాడు చేశారని యాజమాన్యం ప్రచారం చేసే అవకాశం కూడా లేకపోలేదని ఆందోళన వ్యక్తమవుతోంది. బ్లాస్ట్ ఫర్నేస్-3 ఇంకా సిద్ధం కాక ముందే దానికి అవసరం అంటూ 25 వేల టన్నుల పెల్లెట్ల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చేశారు. టన్ను రూ.13 వేలు చొప్పున కొంటున్నారు. ఇంకో వైపు కోక్ 50 వేల టన్నులు కావాలంటూ టెండర్ ప్రకటన జారీచేశారు. వీటి కొనుగోళ్లలో వచ్చే కమీషన్ కోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్షణమే ఎంపీలు, కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఇందులో జోక్యం చేసుకొని ముందు బ్లాస్ట్ ఫర్నేస్-3కి మరమ్మతులు జరిగేలా చూడాలని, ఆ తరువాతే ముడి సరకుల కొనుగోళ్లపై దృష్టి పెట్టాలని యాజమాన్యాన్ని హెచ్చరించాల్సిన ఆవశ్యకత ఉంది.

కేసులు ఎక్కువ.. సిబ్బంది తక్కువ

» ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌ను వేధిస్తోన్న సిబ్బంది కొరత » నెలకు 50 వరకు కీలక కేసులు » సకాలంలో బాధితులకు న్యాయం అందని పరిస్థితి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. స్మార్ట్ పోలీస్ స్టేషన్‌గా పేర్కొనే ఈ స్టేషన్‌లో కేసుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా ఈ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల ఆగడాలు ఎక్కువగా ఉంటాయి. హత్యలు, హత్యాయత్నాలు, ఆత్మహత్యలు, కొట్లాటలు వంటి కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. పోలీసు సిబ్బందిపైనే నిందితులు తిరిగి దాడి చేసిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇతర స్టేషన్లతో పోల్చుకుంటే ఆధునిక భవనం, వసతులు వంటివి బాగానే కనిపిస్తాయి. కానీ పాలనాపరమైన అంశాల్లో చూస్తే సిబ్బంది కొరత ఇబ్బందిగా మారింది.

నగరంలోని అన్ని స్టేషన్లలోనూ ముగ్గురు లేదా నలుగురు ఎస్‌ఐలు అందుబాటులో ఉంటుండగా, ఇక్కడ మాత్రం ఇద్దరు ఎస్‌ఐలతో నెట్టుకొస్తున్నారు. దీంతో పని భారం పెరగడం, ముఖ్యమైన అంశాల్లో పర్యవేక్షించే అవకాశం ఉండటం లేదు. ఫలితంగా.. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరగడంలేదనే విమర్శ ఉంది.

ఎంవీపీ స్టేషన్ పరిధిలో నెలకు కనీసం 45 నుంచి 50 వరకూ కీలక కేసులు నమోదవుతున్నాయి. మరోపక్క అదృశ్యం కేసుల విషయంలో సిబ్బంది మరింత సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. స్టేషన్ మొత్తం మీద సుమారు 62 మంది సిబ్బంది ఉండాలి. ఎస్‌ఐలు ముగ్గురు ఉండాల్సి ఉండగా, ఒకరు సిక్ లీవ్‌లో ఉన్నారు. నలుగురు ఏఎస్‌ఐ పోస్టులకు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. తొమ్మిది మంది హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు. కానిస్టేబుళ్లు 30 మంది ఉండాలి, కానీ 19 మంది మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇక మహిళా కానిస్టేబుళ్లు ఐగురి స్థానంలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఎనిమిది మంది హోం గార్డులు ఉన్నారు. వీరందరినీ ఎస్‌ఐలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఎవరెవరు ఏం చేస్తున్నారు, ఎవరు ఏం చేయాలన్న దానిపై ఆయా ఎస్‌ఐలకు అవగాహన ఉంటుంది.


ఎంవీపీ పోలీస్‌స్టేషన్

ఈ స్టేషన్ పరిధిలో అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పాటు మురికివాడలు ఉన్నాయి. అలాగే వీఐపీల నివాసాలు, పార్టీల కార్యాలయాలు కూడా ఉన్నాయి. అత్యధికంగా విశ్రాంత అధికారులు ఉన్న ప్రాంతమిది. వీరికి చిన్న సమస్య ఎదురైనా పోలీసులపై ఒత్తిడి ఉంటుంది. కింది స్థాయి అధికారులు లేకపోవడం వల్ల కేసుల దర్యాప్తులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పర్యవేక్షణ కొరవడటం వల్ల కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినా సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారం కుటుంబానికి ఇవ్వకపోవడం, అదే వ్యక్తికి సంబంధించిన అదృశ్యం కేసు నమోదు చేయడం, ఆ వ్యక్తి సరైన చికిత్స అందక మృతి చెందడం వంటివి వివాదస్పదమైంది.

ముఖ్యంగా ఈ స్టేషన్ పరిధిలో ప్రముఖులు ఉండడం వల్ల కూడా ప్రోటోకాల్ విధులు ఉంటాయి. పలు కేసుల విచారణలో భాగంగా సిబ్బంది వివిధ ప్రాంతాల్లో రోజుల తరబడి ఉండిపోవాల్సి వస్తోంది. నగరంలో ప్రధానంగా పేర్కొనే ఎంవీపీ కాలనీ పోలీసుస్టేషన్‌లో ఇలా సిబ్బంది కొరత ఉండడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులు జాతీయ భావన అలవర్చుకోవాలి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలను గౌరవించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అన్నారు. చండీఘడ్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ కనబరిచిన బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి చరణ్‌ను కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత శిబిరంలో చరణ్ తెలుగు సంస్కృతీసంప్రదాయాలు ప్రతిబింబించే ప్రదర్శనలిచ్చి కళాశాల ఖ్యాతిని ఇనుమడింపజేయడం ఆనందకరమన్నారు. ఇలాంటి శిబిరాలు విభిన్న సంస్కృతులు, భాషలపై పరస్పరం గౌరవం, అవగాహన పెంచుకోవడానికి దోహదపడతాయన్నారు. జాతీయ ఐక్యత ఉంటేనే దేశాభివృద్ధి గణనీయంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


విద్యార్థి చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

స్టాల్స్ లేని రైతులకూ రైతుబజార్‌లో అవకాశం


టమాటాలు విక్రయిస్తున్న రైతులు, పర్యవేక్షిస్తున్న ఈవో వరహాలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన టమోటాలను నేరుగా రైతు బజార్‌కు తీసుకొచ్చి అమ్ముకునే వెసులుబాటును మార్కెటింగ్ శాఖ కల్పించింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాన్ని వినియోగించుకుని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన రైతులు 9.50 క్వింటాళ్ల టమోటాలు ఎంవీపీ రైతు బజార్‌కు గురువారం తీసుకొచ్చారు. మధ్యవర్తులు, దళారీలు లేకుండా నేరుగా రైతు బజార్‌లో కిలో రూ.11లు చొప్పున విక్రయించుకున్నారు. వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు సుధాకర్ ఆదేశాల మేరకు రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు కనకరాజు పర్యవేక్షించారు.

నేడు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆరిలోవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పైనాపిల్ కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వి-3 (ఆపరేషన్) ఈఈ పోలాకి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ పైనాపిల్ కాలనీ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు చేపడుతుండడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఈ కారణంగా పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, కామాక్షినగర్, సీబీడీ కార్యాలయం, జేఎస్ఎన్ యూఆర్ఎం బ్లాక్‌లు, శ్రీకాంత్‌నగర్ లే అవుట్, కనకమహాలక్ష్మి కాలనీ, రాజీవ్‌నగర్, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్ ప్రాంతం, ఆరిలోవ ఆఖరి బస్టాప్, పాండురంగపురం, నెహ్రూనగర్, దుర్గాబజార్, లక్ష్మినగర్, శివాజీనగర్, ప్రగతినగర్ తదితర ప్రాంతాలో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెండో రోజూ కొనసాగిన నిరుద్యోగుల నిరసన

» రోస్టర్‌లో తప్పులు సరిదిద్దిన తర్వాతే గ్రూప్-2 నిర్వహించాలని డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షకు సంబంధించి రోస్టర్‌లో తప్పులు సరిదిద్దాలంటూ ఆందోళన బాట పట్టిన నిరుద్యోగులు తమ నిరసనను రెండో రోజైన గురువారం కూడా కొనసాగించారు. రోస్టర్ తప్పులు సరిదిద్దకుండా పరీక్ష నిర్వహిస్తే తాము అన్యాయమైపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీ సర్కిల్ వద్ద నిరసనకు దిగారు. గత ప్రభుత్వం తమ గోడును పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం తమ ఆవేదన అర్థం చేసుకుంటుందని భావించామని, అయితే ఈ ప్రభుత్వం కూడా తమ అభ్యర్థనను పట్టించుకోకుంటే ఎలా అంటూ వాపోయారు. తప్పులు సరిదిద్దకుండా ఈ నెల 23న పరీక్ష నిర్వహిస్తుండడం అన్యాయమన్నారు. అక్కడకు ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఎంవీపీ స్టేషన్ సీఐ మురళి, ఆరిలోవ ఎస్ఐ రాందాసు వచ్చి నిరుద్యోగ అభ్యర్థులతో మాట్లాడారు.

రామనామం మహాద్భుతం

» ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రామకార్యంలో సహాయం చేసిన కారణంగా సంపాతికి కాలిపోయిన రెక్కలు తిరిగివచ్చాయని, రామకథను చెప్పుకున్నంత మాత్రానే మరణిద్దామనుకున్న వానరులంతా జీవించి అభ్యున్నతిని సాధించారని.. రామకథ, రామనామం, రామకార్యం అంతగొప్పవని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలలో భాగంగా గురువారం కిష్కింధకాండలోని దక్షిణ దిక్కుకు వెళ్లిన వానరులు జరిపిన సీతాన్వేషణ గురించి వివరించారు. దక్షిణ దిక్కుకు వెళ్లిన వానరులు దారిలోని పర్వతాలు, గుహలు, అరణ్యాలు అన్నీ వెతుకతూ వెళుతుండగా, దారిలో తనపుత్రుడు మరణించటం వల్ల ఆగ్రహించిన కండు మహర్షితో శాపానికి గురైన ఒక ప్రాంతం కనిపించింది. అక్కడ చెట్లు, ఆహారం, నీరు, చెట్లు వంటివి లేక ప్రశుపక్ష్యాదులకు ఆవాసం కూడా లేక భయంకర పరిస్థితి ఉందన్నారు. ఇంకొంచెం ముందుకు వెళ్లగా.. అక్కడ ఒక పెద్ద గుహ నుంచి జలపక్షులు బయటకు రావటం గమనించి వారంతా అందు లోకి ప్రవేశించారని, అందులో అనేక రకాల ఆహార పదార్థాలు, భవనాలు కనిపించి వారు ఆశ్చర్యపోయారన్నారు. అక్కడ ఒక యోగిని కనిపించి స్వయంప్రభ బిలం విశేషాలు వివరించిందన్నారు. ఈ కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావును అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.


చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న అన్నంరాజు సత్యనారాయణ

సంపత్ వినాయగర్ దేవాలయ హుండీ లెక్కింపు

» 21 రోజులకు రూ.14,75,802 ఆదాయం


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

సిరిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కించగా, గడిచిన 21 రోజులకు రూ.14,75,802 ఆదాయం లభించినట్టు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ తెలిపారు.బుధవారం ఆలయ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో బంగారం 820 మిల్లీ గ్రాములు, సిల్వర్ 056 మిల్లీ గ్రాములు, యూఎస్‌ఏ 108, ఖతార్ రియాల్ 1, బంగ్లాదేశ్ డాకా 20, చెక్కు రూ.111 లభించినట్టు తెలిపారు. కార్యక్రమానికి దేవాదాయ శాఖ హుండీల సూపర్‌వైజర్స్ ఎస్.ప్రసన్నలక్ష్మి, శ్రీవేంకటేశ్వర సేవా సంఘం, ఆలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

ఉల్లి ధరల తగ్గింపునకు చర్యలు : జేసీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో డిమాండ్‌కు తగినంత ఉల్లిపాయల నిల్వలను పెంచుకోవడం, ధరల తగ్గింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఆధ్వర్యంలో జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే ఉల్లి కిలో రూ.19 ఎక్కువగా ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. మిగిలిన కూరగాయల ధరలు తక్కువగానే ఉన్నాయన్నారు. దీనికి మార్కెటింగ్ అధికారులు బదులిస్తూ మహారాష్ట్ర నుంచి రావాల్సినంత ఉల్లిపాయలు రాకపోవడంతో ధరలు పెరిగాయన్నారు. డిమాండ్‌కుసరిపడా ఉల్లిపాయుల సరఫరా నిమిత్తం నాసిక్‌లోని వ్యాపారులతో మాట్లాడుతున్నామని హోల్‌సేల్ వ్యాపారులు వివరించారు. వచ్చే వారానికి ఎక్కువగా స్టాక్ వస్తోందని, అప్పుడు ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. కూరగాయల పంట అమ్మకాలపై ఉద్యానవనశాఖ అధికారులు వివరించడంతో జేసీ జోక్యం చేసుకుని జిల్లాలో రైతులు పండించే కూరగాయలు రైతుబజార్లలో విక్రయాలకు అనువుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఉద్యానవన, మార్కెటింగ్, వ్యవసాయ అధికారులు, రైతుబజార్ల ఈవోలు, హోల్‌సేల్ వ్యాపారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరి వీడాలి

ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్

ఆరిలోవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల మూడో వేతన సవరణ తక్షణమే ప్రకటించి పెన్షన్ రివిజన్‌తో పాటు 4 జి, 5 జి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ అసిస్టెంట్ సర్కిల్ కార్యదర్శి బీఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. గురువారం విశాలాక్షినగర్‌లో గల విజయ జోన్ ఆర్కెడ్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 2017, జనవరి నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు వేతన సవరణలు జరగాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలో పని చేసిన ఉద్యోగులకు పదేళ్లకొకసారి వేతన సవరణ చేయాల్సి ఉన్నా 17 ఏళ్లుగా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. పెన్షనర్స్‌కు పెన్షన్ రివిజన్ అమలు కూడా చేయడం లేదన్నారు. ఈ సమస్యలపై మార్చి 14న విజయవాడలో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీవోటీ పెన్షనర్స్ అసోసియేషన్, ఏపీ 3వ సర్కిల్ సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అనువైన పరిస్థితులు ఉన్నా 4జీ, 5జీ సేవలను విస్తరించకుండా సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని రాజు విమర్శించారు. గత ఎనిమిదేళ్ల నుంచి పెన్షన్ రివిజన్ జరగకపోవడానికి కేంద ప్రభుత్వ విధానాలే కారణమని మండిపడ్డారు.

ఈ విషయంలో న్యాయస్థానాల్లో వ్యాజ్యాలను సాకుగా చూపి నిరాకరిస్తుండడం దుర్మార్గమన్నారు. దీని వల్ల లక్షలాది కుటుంబాల ఇబ్బందులకు లోనవుతున్నాయన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.గోవిందరావు, జి.ఫ్రాన్సిస్ (విజయనగరం), పీవీ రమేశ్, ఎస్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ఎన్ రాజు, గోవిందరావు, ఫ్రాన్సిస్ తదితరులు

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

సిరిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకిస్తూ ఈ నెల 14 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునివ్వడం జరిగిందన్నారు. పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ పథకంలో రూ.60 వేల కోట్లు బడ్జెట్‌లో కోత విధించారని, అలాగే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విద్య, వైద్యం రంగాలకు కూడా బడ్జెట్‌లో నిధులు తగ్గించారని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బిహార్ రాష్ట్రానికి బడ్జెట్‌లో అనేక ప్రయోజనాలు కలిగించారని, అలాగే ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆదాయపు పన్నులో మధ్య తరగతికి ప్రయోజనం కలిగిస్తున్నట్టు బడ్జెట్‌లో పొందుపరిచారని విమర్శించారు. దీని వెనుక ఎన్నికల్లో గెలవాలన్న మోసపూరిత కుట్ర ఉందన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు జిల్లా కార్యదర్శి దేవా మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీ అధిపతులు అదానీ, అంబానీ తదితరులకు ప్రయోజనం కలిగే విధంగా బడ్జెట్‌లో అనేక రాయితీలు కల్పించారని విమర్శించారు. వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్‌గా మోదీ ప్రభుత్వం వర్ణించడం పచ్చి మోసమన్నారు. ఈ బడ్జెట్ చీకటి భారత్ నిర్మించేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వానికి భజన చేయడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని ఏపీకి చెందిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్ చెప్పడం దుర్మార్గమన్నారు. ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అన్నారు. కార్యక్రమంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సభ్యులు కే.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సభ్యులు బి.గంగారావు, బి.పద్మ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ కోరుతూ 23న న్యాయవాదుల సదస్సు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ ఎట్ డోర్ స్టెప్స్ నినాదంతో విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కోర్టుల ఆవరణలోని బార్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో న్యాయవాదుల సదస్సు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల న్యాయవాదులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు డిమాండ్ 1993 నుంచి ఉందని, ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 43 శాతం ఈ ప్రాంతానికి చెందినవేనని పేర్కొన్నారు. ప్రస్తుతం హైకోర్టు ఉన్న విజయవాడ వెళ్లాలంటే 700 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో పాటు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు సంబంధించిన అంశాలను రూపొందించి రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన మంత్రి, కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర ముఖ్యమంత్రి వినతిపత్రాలు సమర్పిస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడితో గద్దె బాబూరావు భేటీ



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలసిన గద్దె బాబూరావు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబును తెలుగుదేశం నేత, ఎన్నికల పరిశీలకుడుగా వ్యవహరిస్తున్న గద్దె బాబూరావు గురువరం భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న రఘువర్మ గెలుపుపై అనుసరించాల్సిన వ్యూహంపై వీరిద్దరూ చర్చించినట్టు తెలిసింది. ఓటర్ల జాబితాను పరిశీలించారు.

టెన్త్ స్టడీ అవర్స్ పరిశీలించిన డీఈవో

ఆరిలోవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ గురువారం సాయంత్రం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్నన్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. హిందీ స్టడీ అవర్స్‌లో విద్యార్థులతో డీఈవో మాట్లాడారు. కొన్ని ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. సంతృప్తి వ్యక్తంచేశారు. ఏవైనా క్లిష్టంగా అనిపించినా, అర్థం కాకున్నా వెంటనే ఉపాధ్యాయులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలని విద్యార్థులను సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి కొన్ని సూచనలు అందించారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాభవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరదేశమ్మ ఆలయ వార్షికోత్సవం రేపు

విశాఖపట్నం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తాటిచెట్లపాలెం రైల్వే న్యూకాలనీలో కొలువుదీరిన పరదేశమ్మ ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఈ నెల 22న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు గణపతి పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి పుణ్యాహవచనం, పంచగవ్య అంకురార్పణ, శాంతి మండపారాధన, సుగంధద్రవ్యాలతో 108 కలశాలతో ఆరాధన, గ్రామ ప్రదక్షణ, అమ్మవారికి అభిషేకం, సహస్ర కుంకు మార్చన, ప్రదోష కాలాంత అమ్మవారి శాంతి హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అలాగే ఈ నెల 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆ రోజు రాత్రి 9 గంటలకు మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఏటా మాదిరిగానే మార్చి ఏడో తేదీన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు వారు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


లాసన్స్‌బే సమీపంలో డివైడర్‌పైకి ఎక్కిన కారు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఓ కారు అతి వేగంతో వచ్చి డివైడరుపైకి ఎక్కింది. అదృష్టవశాత్తూ ఎలాంటి పెను ప్రమాదం లేకపోవడం, ఎవరికీ గాయాలు కాకపోవడంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం నగరంలో నుంచి బీచ్ రోడ్డు మీదుగా అప్పుఘర్ వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి అదుపు తప్పి డివైడరు పైకి ఎక్కి ఆగిపోయింది. కారుకు నెంబరు లేకపోవడం గమనార్హం. కొద్ది సేపటిలోనే సంబంధిత వ్యక్తులు కారును అక్కడి నుంచి తొలగించి తీసుకుపోయారు.

సినిమా గైడ్

- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
- **తండేల్ :** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 37, టమాటా 11, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 62, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 32, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

స్టార్ హోటళ్లలో అగ్నిప్రమాదాల నివారణపై సదస్సు

మహారాణిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణ (ఫైర్ సేఫ్టీ మీట్)పై గురువారం హోటల్ గ్రీన్ పార్కులో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, టూరిజం ఫోరం సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. చీఫ్ ఇంజనీర్లు, నగరంలోని స్టార్ హోటళ్ల సెక్యూరిటీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు హోటళ్లలో బస చేసిన అతిథులు, సిబ్బంది రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సుమారు 60 మంది వివిధ హోటళ్ల ప్రతినిధులు హాజరుకాగా వారికి విశాఖ జోన్ చైర్మన్ ఎంవీ పవన్ కార్తీక్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు.

'ఉపాధ్యాయ ఉద్యమ వారసత్వాన్ని నిలుపుదాం'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ సమస్యలపై శతశాతం గళమెత్తే సత్తా పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న ఏకైక అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మాత్రమే ఉందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమ వారసత్వాన్ని నిలుపుకొందామన్నారు. రాజకీయాలకు అతీతంగా జరగవలసిన ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓటర్లను భ్రమలలో ఉంచడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీతో అంటకాగుతూ వారి మద్దతుతో గెలిచిన ప్రజాప్రతినిధి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకం లేదన్నారు. ఈ నేపథ్యంలో కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార, సీతంపేట ప్రాంతాల్లో విద్యుత్ హెచ్‌టీ లైన్ల మరమ్మతు కారణంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధారలోని బాలయ్యశాస్త్రి లే అవుట్, మోర్ సూపర్ మార్కెట్ డౌన్ రోడ్డు, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ రోడ్, కైట్స్ కాలేజి, సీతంపేట ప్రధాన రహదారి, శాంతిపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతి



కూటమి నాయకులిచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డులోని రాజేంద్రనగర్ బసవ తారక రామారావు కాలనీలో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కట్టిన హౌసింగ్ స్కీంలో ఇళ్లు పొందినవారు 24 సంవత్సరాలుగా పట్టాలందక ఇబ్బంది పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షులు నారా కిషోర్, టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్‌లు గురువారం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రం అందజేశారు. కనక దుర్గా సంక్షేమ సేవా సంఘం కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు నరాల బాలకృష్ణ, కూటమి నాయకులు పాలేపు ధనాజి, మన్మథరావు, అప్పలనాయుడు, సింహాద్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి-నౌపడా సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి: వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, పర్లాకిమిడి సెక్షన్‌లో డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు గురువారం పర్యటించి ప్రయాణికుల సదుపాయాలు, భద్రతా నిర్వహణపై తనిఖీలు చేశారు. ముందుగా పర్లాకిమిడి స్టేషన్‌లో అమృత భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న వెయిటింగ్ హాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి తదితర పనుల పరోగతిని పరిశీలించారు. అనంతరం నౌపడ స్టేషన్‌కు చేరుకుని అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. తిలారు స్టేషన్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనులపై సమీక్షించారు. సదుపాయాలు మరింత మెరుగుపరచడానికి అవసరమైన చర్యలపై ప్రయాణికులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. సౌకర్యాల అభివృద్ధికి సంబంధించి భవిష్యత్తు ప్రణాళికలపై అధికారులతో చర్చించారు.

కులం పేరుతో మహిళను దూషిస్తున్న వ్యాపారిపై చర్యకు డిమాండ్



బైఠాయించిన మహిళల వద్ద కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చలువతోట ప్రాంతంలో మహిళలను కులం పేరుతో దూషిస్తున్న స్థానిక వ్యాపారి కొండలరావుపై చర్యలు తీసుకోవాలని వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు పోలీసులను కోరారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధిత మహిళలు సీఐకి ఈ విషయమై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతకు ముందు వ్యాపారి స్థలం వద్ద బాధిత మహిళలు నిరసన తెలపగా, వారికి కందుల నాగరాజు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో బుజ్జి, సన్యాసిరావు, సూరిబాబు, జ్యోతి, రవణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేటలో చిల్లర దొంగల చేతివాటం!

▸▸ రాత్రి 11దాటితే రోడ్డు పై కాపలా ▸▸ ద్విచక్రవాహనదారుల నుంచి ఫోన్లు, నగదు లాక్కుని పరారీ ▸▸ పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

కంచరపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి రామ్మూర్తిపంతులుపేట, గవరకంచరపాలెం ప్రాంతాల్లో దారిదోపిడీలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ గల ఆర్పీపేట రైల్వే గేటు నుంచి వాషింగ్ లైన్‌కు వెళ్లే మార్గంలో రాత్రి 11 దాటితే చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. వాషింగ్ లైన్ మార్గంతో పాటు అండర్‌పాత్ వే వద్ద కాపలా కాస్తూ ద్విచక్రవాహనదారులు, పాదచారుల నుంచి సెల్ ఫోన్లు, పర్సులు లాక్కుని ఉడాయిస్తున్నారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో రెండు ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై కంచరపాలెం పోలీసులకు నెలరోజుల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా స్థానిక విద్యుత్ కార్యాలయం రింగ్ రోడ్డుతో పాటు గవర కంచరపాలెం ప్రధాన వీధుల్లో తొమ్మిది ద్విచక్రవాహనాలు ఏడాదిగా పార్కింగ్ చేసి ఉన్నాయని ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలను ఎక్కడి నుంచో తీసుకుని వచ్చి తమ ప్రాంతంలో ఉంచుతున్నారని పేర్కొంటున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మితిమీరుతున్న దొంగతనాలను కట్టడి చేయాలని, ఇక్కడ విడిచిపెట్టిన వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్పీపేటలో ఏడాదిగా పార్కింగ్ చేసి వదిలేసిన ద్విచక్రవాహనాలు



దొంగతనాలు జరుగుతున్న వాషింగ్ లైన్ రోడ్డు

ఉన్నత భవితకు నైపుణ్యాలు అవసరం: ఎంపీ శ్రీభరత్



పౌర గ్రంథాలయంలో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఎంపీ శ్రీభరత్

సీతంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏ రంగంలో అయినా విజయం సాధించాలంటే గట్టిగా కష్టపడేందుకు సిద్ధంగా ఉండాలని, విద్యతో పాటు ఇతర నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ, కోశాధికారి కె.వి.గుప్తలు గ్రంథాలయంలోని అన్ని విభాగాలను ఆయనకు చూపుతూ, అందుబాటులో ఉంచిన పుస్తకాలు, గ్రంథాలయం అందిస్తున్న సేవలను తెలియజేశారు. గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులతో ఎంపీ ముచ్చటించారు. చాలా విలువైన పుస్తకాలు, చదువుకునేందుకు ఆహ్లాదకర వాతావరణం ఇక్కడ ఉందని, చదువరులకు ఈ గ్రంథాలయం స్ఫూర్తినిస్తుందని శ్రీభరత్ పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయం హాలులో పబ్లిక్ లైబ్రరీ, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. లక్ష్య సాధనకు చివరి వరకు పోరాడుతూ ఉండాలని, మనలో లోపాలను తెలియజేసినప్పుడు సానుకూల దృక్పథంతో స్వీకరించాలని హితవు పలికారు. మనం పడే కష్టం వేరొకరు పడకూడదని అనుకున్నప్పుడే వ్యవస్థలో మార్పు వస్తుందని, దానికి మన వంతుగా కృషి చేయాలన్నారు. ఇందుకు స్వీయ క్రమశిక్షణ అవసరమన్నారు. ముందుగా సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సొసైటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్

అల్లిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు లక్షలాది రూపాయిలు వెచ్చించి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు మొండి చెయ్యి చూపేవిధంగా ప్రకటనలతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. తక్షణమే మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజు, వి.కన్నబాబు, బి.వాను, ఎస్.కిరణ్ ,కె.శ్రీనివాసరావు, బి.సంతోష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు కెమికల్ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న డా. కె.వి.రమణ

కంచరపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో ఆఖరి సెమిస్టర్ చదువుతున్న 20 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికై ఉద్యోగాలు సాధించారు. తమిళనాడులోని వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఇటీవల చేపట్టిన ఇంటర్వ్యూల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. పెట్రో కెమికల్ విభాగం నుంచి ఐదుగురు, కెమికల్ విభాగం నుంచి 15 మంది ఇంజినీర్ ట్రైనీ, ట్రైనీ డిప్లొమా టెక్నీషియన్ ఉద్యోగాలు సాధించారు. ఇంజినీర్ ట్రైనీ అభ్యర్థులకు ఏడాదికి రూ.3.25 లక్షలు, డిప్లొమా టెక్నీషియన్స్‌కు ఏడాదికి రూ.2.5 లక్షల వేతనం చెల్లిస్తారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ గురువారం వారికి నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డా.ఎం.విజయలక్ష్మి, ప్లేస్మెంట్ అధికారి కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ దివాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో నిర్మాణంపై స్థానికుల అభ్యంతరం

కంచరపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి గంగన్ననగర్ పాత రామారావు ఆసుపత్రిని ఆనుకుని నిర్మిస్తున్న భవనంపై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇక్కడ ఆసుపత్రిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఓ కాంట్రాక్టరు నిర్మాణం చేపడుతున్నారు. అయితే ప్లాన్‌కు భిన్నంగా రోడ్డుపైకి స్తంభాలు (పిల్లర్స్) వేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు-నిత్యం ట్రాఫిక్‌తో సతమతమవుతుండే స్థానికులు ఇలా రోడ్డుపైకి వచ్చి నిర్మాణం చేపడుతుండడంపై భవిష్యత్‌లో తలెత్తే ఇబ్బందులపై టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని సమీప సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లగా సంబంధిత బిల్డింగ్ యజమానికి వత్తాసు పలుకుతుండడం విశేషం. సమీపంలో టోకు కిరాణా దుకాణాలతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని, ఇలా రోడ్డు మీదకు వచ్చి ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం ప్రారంభ దశలో ఉన్నందున టౌన్ ప్లానింగ్ అధికారులు తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

'అగస్త్య మహర్షి ఆధునిక తమిళ వ్యాకరణ కర్త'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఇతర ప్రముఖులు

సీతమ్మధార, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అగస్త్య మహర్షికి భగవాన్ శివుడు తొలుత భాషను నేర్పించారని, దానిని సరిగా వ్యాకరణం చేసి ఆయన ప్రపంచానికి అందించారని వక్తలు పేర్కొన్నారు. సీతమ్మధారలోని తమిళ్ కళైమండ్రం వేదికలో భారతీయ భాషా సమితి, మినిస్టరీ ఆఫ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కాశీ తమిళ సంఘం నేషనల్ సెమినార్ ఆన్ మహర్షి అగస్త్యా అనే అంశంపై గురువారం ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తమిళనాడు బీజేపీ వైస్ ప్రెసిడెంట్ కె.నాగరాజన్, చోడవరం టీడీపీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగస్త్య మహర్షి భాష లోతైన భావంతో కూడిన పురాతనమైనదిగా పరిగణిస్తారని, ఇది ఆధునిక ప్రపంచంలోని ప్రతి పండితుడు అంగీకరించారన్నారు. తమిళ్, దాని దైవికత లోతైన అర్థాల కారణంగా అత్యంత పురాతనమైన, మనుగడలో ఉన్న భాషగా ఉందన్నారు. అందువల్ల అగస్త్యుడిని ఆధునిక తమిళ్ వ్యాకరణ కర్తగా పరిగణిస్తారన్నారు. కంభ రామాయణం, మహాకవి భారతి పాటలలో కూడా ప్రస్తావించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీత, తమిళ్ కళామండ్రం వేదిక అధ్యక్షుడు ఆర్.రాజశేఖరన్, ఎ.ఎం. అశోఖాన్, కె.చిన్నాలయ్య, తమిళ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు 16 కేంద్రాలు

... 5వ పేజీ తరువాయి

అనుమతించాలని, వారిని కూడా తనిఖీ చేయాలన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని, నిర్ణీత సమయంలోగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒరిజినల్ ఓఎంఆర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు అందజేసి కిందనున్న డూప్లికేట్ పత్రాన్ని మాత్రమే తీసుకువెళ్లాలన్నారు. పరీక్షకు ఐదు నిమిషాల ముందు మాత్రమే సీల్డు కవర్‌లో ఉన్న ప్రశ్నపత్రాలను ఓపెన్ చేసి అభ్యర్థులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఏడీసీపీ రాజ్‌కమల్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ అశోక్, తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం తొలుత అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీపీఎస్సీ చైర్మన్ ఎ.ఆర్.అనురాధ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షకు సంబంధించి పలు మార్గదర్శకాలు జారీచేశారు.

ఫైనల్స్‌లో విజయనగరం, కవలియర్స్

▸▸ తుది దశకు యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న 11వ యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో విజయనగరం జిల్లా క్రికెట్ సంఘం, కవలియర్స్ సిసి (విశాఖ) ఫైనల్స్‌కు చేరాయి. గురువారం ఉత్కంఠగా జరిగిన తొలి సెమీస్‌లో విజయనగరం జిల్లా క్రికెట్ జట్టు ఏడు పరుగుల తేడాతో గెలాక్సీ సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయనగరం నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 198 పరుగులు చేసింది. ఓపెనర్లు గుల్సామ్ సాలే (35), దుర్గాకుమార్ (23) శుభారంభం ఇవ్వగా, మిడిల్ ఆర్డర్‌లో హర్రీపోటర్ (23), వై.వాసు (35), ధీరజ్‌కుమార్ (23), పి.తేజస్వి (34) సమయోచితంగా రాణించి స్కోరు బోర్డును ముందుకు నడిపారు. గెలాక్సీ బౌలర్లలో నారాయణరాజు, అరుణ్, హేమంతరెడ్డి తలో రెండు వికెట్లు తీశారు. లక్ష్య ఛేదనలో చివరి బంతి వరకు పోరాడిన గెలాక్సీ సిసి నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 191 పరుగులు చేసి అనూహ్య ఓటమి చెందింది. ఓపెనర్ రేవంతరెడ్డి (28), మిడిల్ ఆర్డర్‌లో సందీప్ (71), పైల అవినాష్ (54 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి జట్టును గెలిపించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విజయనగరం బౌలర్లలో తపస్వి, వాసు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆల్‌రౌండర్ ఆటతీరు ప్రదర్శించిన వాసు (విజయనగరం) మ్యాన్ ఆఫ్ ద ప్లేయర్‌గా నిలిచాడు.



కవలియర్స్ ఆటగాడు రాజుకు మ్యాన్ ఆఫ్ ద ప్లేయర్ అవార్డు అందిస్తున్న గాదం డెంటల్ హాస్పిటల్స్ మేనేజర్ శ్రీనివాస్, యూసీసీ ప్రతినిధి సోమేష్

గాజువాకపై కవలియర్స్ విజయం

సెకెండ్ సెమీస్‌లో కవలియర్స్ సిసి నాలుగు వికెట్ల తేడాతో గాజువాక గ్రీన్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గాజువాక గ్రీన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 138 పరుగులు చేసింది. మహీప్‌కుమార్ (30), సమన్విత్ (46) మినహా మిగిలినవారు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. కవలియర్స్ బౌలర్లలో కెఎస్ఎన్.రాజు, సాయి శ్రావణ్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కవలియర్స్ సిసి 17.4 ఓవర్లలో ఆరు వికెట్లకు 140 పరుగులు చేసి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. వర్ధన్ (40), సాయి శ్రావణ్ (26), మునిష్ వర్మ (17), కెఎస్ఎన్.రాజు (27) రాణించి జట్టుకు విజయాన్నందించారు. గాజువాక గ్రీన్స్ బౌలర్లలో ఆశిష్, అప్పన్న చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన కెఎస్ఎన్.రాజు (కవలియర్స్) మ్యాన్ ఆఫ్ ద ప్లేయర్‌గా నిలిచాడు.

పూడికలతో నిండిన గెడ్డలు



ఎనభై అడుగుల రోడ్డులోని గెడ్డలో తొలగించని పూడిక

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26, 43, 44 వార్డుల్లోని పలు గెడ్డలు పూడికలతో నిండిపోయాయి. వాటి చుట్టుపక్కల నివసిస్తున్న స్థానికులు గెడ్డల నుంచి వెలువడే దుర్వాసనకు ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి పూడికలు తొలగించకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా ఉన్న గెడ్డలోనూ, ఎనభై అడుగుల రోడ్డుకు ఆనుకుని ఉన్న గెడ్డలోనూ పూడికలు నిండిపోయాయి. పాలిథిన్ కవర్లు గుట్టలుగా పేరుకుపోయాయి. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలకు ఆవాసాలుగా మారాయి. చుట్టుపక్కల స్థానికులే గెడ్డల్లో చెత్తను వేయడం వల్ల అది పేరుకుపోతుంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో గెడ్డ వ్యర్థాలతో నిండిపోతోంది. ఎక్కడికక్కడ వ్యర్థాలు ఉండడంతో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఆయా ప్రాంతాల్లో చెత్త డబ్బాలు లేకపోవడంతో వ్యర్థాలను గెడ్డల్లో పడేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు ఉదయం వచ్చి చెత్త సేకరిస్తుంటారు. రాత్రి సమయంలో ఇళ్లలోని చెత్తను, భవన నిర్మాణ వ్యర్థాలను కూడా గెడ్డలో పడేస్తున్నారు. చాలా నెలల నుంచి గెడ్డల్లోని పూడికలు తొలగించకపోవడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. జీవీఎంసీ అధికారులు స్పందించి పూడికలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాల్ట్ పథకంతో బోధనకు ఆటంకం: యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, చిత్రంలో ఇతర ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సాల్ట్ పథకంతో ప్రభుత్వ విద్యా రంగానికి తీరని నష్టమని, దీని నుంచి వెంటనే బయటకు రావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లా యూటీఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల క్రితం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో 'నాణ్యమైన విద్య.. ప్రపంచస్థాయి విద్యార్థి లక్ష్యం'గా చేసుకున్న ఒప్పందంలో భాగంగా వచ్చిన సాల్ట్ పథకం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. తక్షణమే సాల్ట్ పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. బోధన మానేసి ఉపాధ్యాయులు రోజువారీ గణాంకాలు సేకరించడం వల్ల అసలు లక్ష్యం పక్కకు వెళ్లిందన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, బోధనేతర పనులు అప్పగించవద్దని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేద్కర్, కోశాధికారి ప్రభాకర్, ఎన్.ప్రభాకర్, టి.అప్పారావు, రిజ్వాన్, రాము, రియాజ్, జగన్, విజయకుమారి పాల్గొన్నారు.

ఆవుకు శస్త్రచికిత్స చేసి 50 కేజీల ప్లాస్టిక్ తొలగింపు!

ఆనందపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశు వైద్యశాలలో గురువారం ఆవుకు శస్త్రచికిత్స చేసి 50 కేజీల వరకు ప్లాస్టిక్‌ను బయటకు తీశారు. వేములవలసకు చెందిన కోరాడ నాయుడుబాబు ఆవు ఐదు రోజుల నుంచి మేత మేయడం లేదు. పడుకునేందుకు ఇబ్బంది పడింది. కడుపు నొప్పితో బాధపడుతుండడంతో పశువైద్యుల్ని సంప్రదించారు. డాక్టర్ అనీల్‌కుమార్ ఆ ఆవును పరిశీలించి శస్త్రచికిత్స చేశారు. పొట్టలో నుంచి 50 కేజీల వరకు ప్లాస్టిక్ కవర్లు, తాళ్లు తీశారు. ప్లాస్టిక్ తింటున్న మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని, రైతులు జాగ్రత్తగా ఉండాలని అనీల్‌కుమార్ సూచించారు. పశువైద్య సిబ్బంది సుజాత, దుర్గలక్ష్మి, రమణ, సంతోష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీడిన మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

కత్తితో పొడిచి హతమార్చాడు. ఈ సందర్భంలో ఇరువురి మధ్య జరిగిన పెనుగులాటలో చిన్నారావు చూపుడు వేలికి గాయమైంది. కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందాడు. తిరిగి పదకొండో తేదీ తెల్లవారుజామున పెట్రోల్ తీసుకుని భార్యతో కలిసి ఆరు గంటలకు ఆ లేఅవుట్ వద్దకు వెళ్లాడు. అప్పన్న శవంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అప్పన్నను హతమార్చిన చిన్నారావును, నేరం చేయడానికి సహకరించి సాక్ష్యాలను తారుమారు చేయడానికి యత్నించినందుకు అతడి భార్యను గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి నైఫ్, రక్తపు మరకలు కలిగిన నిందితుడి జీన్స్ ప్యాంటు, అప్పన్న ఫోన్ పౌచ్, లైటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సుధాకర్ తెలిపారు.

ఉక్కు యాజమాన్యం అత్యుత్సాహం

... 5వ పేజీ తరువాయి

కేంద్ర మంత్రి కుమారస్వామి చెప్పారు. అయితే ఇక్కడే యాజమాన్యం సొంత ఆసక్తి బయటపడింది. ప్రస్తుత సీఎండీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆర్ఐఎన్ఎల్‌కు సీఎండీగా శక్తిమణిని కమిటీ ఇప్పటికే ఎంపిక చేసింది. ఆయన ఏప్రిల్‌లో ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. ఈలోగా బ్లాస్ట్ ఫర్నేస్-3ను ప్రారంభించేసి, దానికి అవసరమైన కోక్, పెల్లెట్లను వేల టన్నుల్లో కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్నారు. ఆగస్టులో ప్రారంభించాల్సి ఉండగా, మార్చి నెలాఖరు నాటికే ఉత్పత్తికి సిద్ధం చేస్తున్నారు. కూలింగ్ ప్లేట్లు కొత్తవి చైనా నుంచి తెప్పిస్తున్నట్టు తెలిసింది. అవి అమర్చేసి, ఉత్పత్తి ప్రారంభించాలని అనుకుంటున్నారు. మిగిలిన నిర్వహణ పనులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఈ విధంగా చేస్తేమూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో బ్లాస్ట్ ఫర్నేస్-3లో మళ్లీ పెద్ద సమస్య తలెత్తే ప్రమాదం ఉందని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. మరమ్మతులు చేయడానికి వందల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంటున్నాయి. కార్మికులే సరిగ్గా నడపలేక దానిని పాడు చేశారని యాజమాన్యం ప్రచారం చేసే అవకాశం కూడా లేకపోలేదని ఆందోళన వ్యక్తమవుతోంది. బ్లాస్ట్ ఫర్నేస్-3 ఇంకా సిద్ధం కాక ముందే దానికి అవసరం అంటూ 25 వేల టన్నుల పెల్లెట్ల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చేశారు. టన్ను రూ.13 వేలు చొప్పున కొంటున్నారు. ఇంకో వైపు కోక్ 50 వేల టన్నులు కావాలంటూ టెండర్ ప్రకటన జారీచేశారు. వీటి కొనుగోళ్లలో వచ్చే కమీషన్ కోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్షణమే ఎంపీలు, కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఇందులో జోక్యం చేసుకొని ముందు బ్లాస్ట్ ఫర్నేస్-3కి మరమ్మతులు జరిగేలా చూడాలని, ఆ తరువాతే ముడి సరకుల కొనుగోళ్లపై దృష్టి పెట్టాలని యాజమాన్యాన్ని హెచ్చరించాల్సిన ఆవశ్యకత ఉంది.

చేతులు మారుతున్న 'తహశీల్దార్' భూములు!

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయనే విషయం అక్కడి తహశీల్దార్‌కు వీఆర్‌ఓ చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. ఇక్కడ అది కూడా జరగలేదు. ఒకే రోజు...ఒక వ్యక్తి పేరు మీద ఉన్న భూములు 43 పద్దుల ద్వారా మ్యుటేషన్ చేయడం అంటే...తప్పకుండా లోతుగా విచారణ చేపట్టాల్సి ఉంటుంది. కానీ అది కూడా చేయలేదు. కనిపించిన భూమినంతా నోషనల్ ఖాతా పేరుతో నమోదు చేసేసి, ఆ తరువాత తాపీగా ఎవరు క్లెయిమ్ చేసుకుంటే వారి పేర్ల మీద మ్యుటేషన్ చేస్తున్నారా?...అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ అదే జరిగితే ఇది భారీ కుంభకోణమే అవుతుంది. మండలాధికారులు అంతా కలిసి చేస్తున్నట్టుగానే భావించాల్సి ఉంటుంది.

నాలా పన్ను బకాయిలు రూ.930 కోట్లు

... 5వ పేజీ తరువాయి

చేస్తోంది. నోటీసులు జారీచేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ పెట్టే యోచనలో యంత్రాంగం ఉంది.

నాలా పన్ను ఐదు శాతం

వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకోవాలంటే ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ విలువలో ఐదు శాతం నాలా పన్ను కింద చెల్లించాలి. స్థానిక సంస్థలు అంటే జీవీఎంసీ, గ్రామ పంచాయతీల అధికారులు ఆయా వ్యక్తులు/సంస్థలకు పలు రకాల అవసరాలకు అనుమతి ఇచ్చేముందే నాలా పన్ను చెల్లించారా?, లేదా?...అనేది తప్పనిసరిగా పరిశీలించాలి. కానీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భవన నిర్మాణదారులతో కుమ్మక్కై చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

ఇంటర్వ్యూ..

రైతులందరూ ఫార్మర్ ఐడీ పొందాలి

-టి.దుర్గాప్రసాద్, పెందుర్తి మండల వ్యవసాయాధికారి



పెందుర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత, సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాల ప్రయోజనాలను రైతులు పొందేందుకు పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులందరూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫార్మర్ ఐడీని పొందాలని మండల వ్యవసాయాధికారి టి.దుర్గా ప్రసాద్ తెలిపారు. మీభూమి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో భూమి గల ప్రతి రైతు తమ 1బీతో అగ్రి స్టాక్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ఫార్మర్ ఐడీ పొందితేనే పైన పేర్కొన్న పథకాలకు లబ్ధిదారులవుతారని పేర్కొన్నారు.

ప్రశ్న: ఫార్మర్ ఐడీ ఎలా పొందాలి?

జవాబు: అర్హత గల రైతులు అగ్రిస్టాక్ పోర్టల్‌లో భూ యజమాని సెల్ ఫోన్‌కు అనుసంధానమైన ఆధార్ కార్డు ద్వారా రైతు సేవా కేంద్రం, గ్రామ/వార్డు సచివాలయంలో పేరు నమోదు చేసుకుని ఫార్మర్ ఐడీ పొందాలి. దీనిపై మండలంలోని రైతులందరికీ ఇప్పటికే అవగాహన కల్పించాం.

ప్ర: ఐడీ కోసం రైతులకు ఏ పత్రాలు పత్రాలు అవసరం?

జ: భూమి 1బీ, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ లింక్ అయిన సెల్ తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక రైతులకు ఐడీ కార్డును పీడీఎఫ్ రూపంలో ఇవ్వడం జరుగుతుంది. ఏమైనా సందేహాలున్నా ఏఈను సెల్ నంబర్ 8331056431 ద్వారా సంప్రదించవచ్చు.

ప్ర: పంట బీమాపై అవగాహన కల్పిస్తున్నారా?

జ: ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా పీఎం ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ రబీ సీజన్ నుంచి రైతులే వ్యక్తిగతంగా బీమా చెల్లించాలి. ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇస్తుంది, రైతులు 25 శాతం చెల్లిస్తే పంటలకు బీమా వర్తిస్తుంది.

పూడికల తొలగింపు

వేపగుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేపగుంట బీఆర్‌టీఎస్ రోడ్డులోని బీసీకాలనీ పరిసరాల్లో కల్వర్టుల్లో పేరుకుపోయిన పూడికలను గురువారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ముఖ్యంగా ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించాలని ఏఎంహెచ్‌వో బండారు అప్పలనాయుడు ఆదేశాలు జారీ చేయడంతో వేపగుంట, నాయుడుతోట ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కాలువల్లోని పూడికలను తీసివేశారు. ఇక్కడ భరించరాని దుర్గంధం వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో పూడికల తొలగింపు పనులు చేపట్టారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక).

● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)

● **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 37, టమాటా 11, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 62, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 52, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 30, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, గోరుచిక్కుడు 34, దేముడుచిక్కుడు 32, కూరపెండలం 26, బ్రకోలి 55 నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

గోపాలపట్నంలో హాకర్స్ జోన్ ఏర్పాటయ్యేనా?

- ప్రధాన రహదారిపై తోపుడుబండ్ల వ్యాపారుల అమ్మకాలు
- తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చని ప్రత్యేక హాకర్స్ జోన్ ప్రతిపాదన



ప్రధాన రహదారిలో తోపుడు బండ్లు

గోపాలపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాన వ్యాపార కేంద్రాలు గల ప్రాంతాల్లో రహదారిపై తోపుడుబండ్ల వర్తకుల కోసం ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటు చేయడానికి చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే గోపాలపట్నం ప్రధాన రహదారిలో అధిక సంఖ్యలో తోపుడుబండ్ల వర్తకులు, ఫుట్‌పాత్‌పై చిరు వ్యాపారులు వివిధ రకాల అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే ప్రధాన రహదారిలోని తోపుడు బండ్ల వర్తకుల కోసం హాకర్స్ జోన్ ఏర్పాటు కోం చేసిన ప్రతిపాదన ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చకపోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండడంతో వాహనదారులతో పాటు వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు. గోపాలపట్నం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి నుంచి ఎన్‌ఏడీ జంక్షన్ వరకు పదుల సంఖ్యలో చిరు వర్తకులు, తోపుడుబండ్ల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వ్యాపార సముదాయాలకు నిలయమైన గోపాలపట్నం ప్రధాన రహదారిలోని సర్వీస్ రోడ్డులో ఉదయం నుంచి రాత్రి వరకు ఈ దుకాణాలు నడుస్తాయి. దీంతో ప్రధాన రహదారిలోని సర్వీస్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే అనేక వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో సర్వీస్ రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తుండడంతో తీవ్ర రద్దీ నెలకొంటుంది. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాలకు ఎంతో ప్రాధాన్యం గల గోపాలపట్నం ప్రాంతంలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు వర్తకులకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

- సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు



అంగన్‌వాడీల శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో కూడిన విద్యను అందించడం వల్ల చిన్నారుల్లో మానసిక ఉల్లాసం, చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు అన్నారు. నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ తరగతులను గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాల నిర్వహణ వల్ల అనేక కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. చిన్నారులకు పాఠశాల వాతావరణం అలవడుతుందన్నారు. ప్రాథమిక స్థాయిలో చిన్నారుల్లో విద్య, క్రీడలు, సామాజిక పరిస్థితుల పట్ల మార్పు తీసుకురావడం సాధ్యమవుతుందన్నారు. జ్ఞాన జ్యోతి పేరిట ఆరు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లోని బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డి.నీలవేణి, ఎంఈవో ఈ.శ్రీనివాసరావు, నడుపూరు హై స్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, రీసోర్స్ పర్సన్లు ఎస్ఎస్ఎస్ఎల్ఎం మూర్తి, ఎన్.సూరిబాబు షేక్ రంజాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సుజాత, ఎలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వీధి లైట్ల సమస్యకు పరిష్కారం

జోన్ పరిధిలోని ప్రతి వార్డులో 70 వీధి దీపాల ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు

గాజువాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న వీధి లైట్ల సమస్యకు త్వరలో పరిష్కారం లభించనున్నది. గత రెండేళ్లుగా కొత్తగా వీధి లైట్లు వేసే పరిస్థితి లేక సంబంధిత అధికారులపై అటు ప్రజల నుంచి ఇటు కార్పొరేటర్ల నుంచి ఒత్తిడి పెరిగింది. ఎట్టకేలకు అధికారులు వీధిలైట్ల ఏర్పాటు నిమిత్తం ఓ కాంట్రాక్టరుకు వర్క్ ఆర్డర్ ఇవ్వడంతో మరికొద్ది రోజుల్లో ఆయా వార్డుల్లో కొత్తగా వీధి లైట్లు వేయనున్నారు. ఒక్కో వార్డుకు 70 వీధి లైట్లను కేటాయించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అధిక శాతం వార్డుల్లో వీధి లేకపోవడంతో రాత్రయ్యేసరికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పలువురు కార్పొరేటర్లు పలుమార్లు అధికారుల ముందు వీధి లైట్ల సమస్యపై అసంతృప్తిని వ్యక్తం చేయడం జరిగింది. జోన్ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ వీధి లైట్ల సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు కూడా అధికారులకు అదేపనిగా ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి వీధి లైట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అన్ని వార్డుల్లోనూ వీధి లైట్లను ఏర్పాటుపై సర్వే చేసి ఒక్కో వార్డుకు 70 వీధీ దీపాలను కేటాయిస్తే దాదాపుగా సమస్య పరిష్కారం అవుతుందన్న అంచనాకు వచ్చారు.

స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

వైద్య సదుపాయాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్



వైద్య సదుపాయాలను యథావిధిగా కొనసాగించాలంటూ నినాదాలు చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వైద్య సదుపాయాలను యథావిధిగా కొనసాగించాలని విశ్రాంత అధికారుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉక్కు యాజమాన్యం మెడికల్ సౌకర్యాలపై తీసుకున్న వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ గురువారం ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కోసం సుమారు నలభై ఏళ్ల పాటు సర్వీసు చేసిన ఉద్యోగులు కేవలం రెండు వేల లోపు మాత్రమే పింఛన్ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సదుపాయాల కోసం ప్రస్తుతం రూ.1,300 చెల్లిస్తున్నామని, దీనిని రూ.పది వేలకు పెంచేందుకు, రీయింబర్స్‌మెంట్ కూడా రూ.16 వేల నుంచి రూ.8 వేలకు తగ్గించేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. దీనివల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడతారన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని శ్రీనివాసరావు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివరామ్, అయోధ్యరామ్, రామారావు, నీరుకొండ రామచంద్రరావు, రామస్వామి, సన్యాసిరావు, పరంధామయ్య, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి ధరల తగ్గింపునకు చర్యలు చేపట్టాలి: జేసీ మయూర్ అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో డిమాండ్‌కు తగినంత ఉల్లిపాయల నిల్వలను పెంచుకోవడం, ధరల తగ్గింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఆధ్వర్యంలో జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే ఉల్లి కిలో రూ.19 ఎక్కువగా ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. మిగిలిన కూరగాయల ధరలు తక్కువగానే ఉన్నాయన్నారు. దీనికి మార్కెటింగ్ అధికారులు బదులిస్తూ మహారాష్ట్ర నుంచి రావాల్సినంత ఉల్లిపాయలు రాకపోవడంతో ధరలు పెరిగాయన్నారు. డిమాండ్‌కు సరిపడా ఉల్లిపాయల సరఫరా నిమిత్తం నాసిక్‌లోని వ్యాపారులతో మాట్లాడుతున్నామని హోల్‌సేల్ వ్యాపారులు వివరించారు. వచ్చే వారానికి ఎక్కువగా స్టాక్ వస్తోందని, అప్పుడు ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. కూరగాయల పంట అమ్మకాలపై ఉద్యానవనశాఖ అధికారులు వివరించడంతో జేసీ జోక్యం చేసుకుని జిల్లాలో రైతులు పండించే కూరగాయలు రైతుబజార్లలో విక్రయాలకు అనువుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఉద్యానవన, మార్కెటింగ్, వ్యవసాయ అధికారులు, రైతు బజార్ల ఈవోలు, హోల్‌సేల్ వ్యాపారులు పాల్గొన్నారు.




నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకిస్తూ ఈ నెల 14 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునివ్వడం జరిగిందన్నారు. పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ పథకంలో రూ.60 వేల కోట్లు బడ్జెట్‌లో కోత విధించారని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బిహార్ రాష్ట్రానికి బడ్జెట్‌లో అనేక ప్రయోజనాలు కలిగించారని, అలాగే ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆదాయపు పన్నులో మధ్య తరగతికి ప్రయోజనం కలిగిస్తున్నట్టు బడ్జెట్‌లో పొందుపరిచారని విమర్శించారు. దీని వెనుక ఎన్నికల్లో గెలవాలన్న మోసపూరిత కుట్ర ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు జిల్లా కార్యదర్శి దేవా మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీ అధిపతులు అదానీ, అంబానీ తదితరులకు ప్రయోజనం కలిగేలా బడ్జెట్‌లో అనేక రాయితీలు కల్పించారని విమర్శించారు. వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్‌గా మోదీ ప్రభుత్వం వర్ణించడం పచ్చి మోసమన్నారు. ఈ బడ్జెట్ చీకటి భారత్ నిర్మించేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వానికి భజన చేయడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సభ్యులు కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు, సభ్యులు గంగారావు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివసాయి దత్త మందిరం వార్షికోత్సవం



పూజలందుకున్న సాయిబాబా

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి కుంచుమాంబ కాలనీలో గురువారం శివసాయి దత్త మందిరం 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం జెండాలతో, విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయినాథునికి కాగడా హారతి, పంచామృతాభిషేకాలు, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అఖండ దీప స్థాపన, సామూహిక కుంకుమ పూజల చేయడంతో పాటు పలువురు భక్తులు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వెండి పల్లకిలో అధిష్టింపజేసి భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధి ఎన్‌ఏడీ అంబేద్కర్ నగర్‌లో ఉన్న షిర్డీ సాయి రామ మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయినాథునికి కాగడా హారతి, క్షీర, జలాభిషేకాలు చేశారు. సాయిబాబా సత్య వ్రతాలు, అన్నదానం, హారతి, ఊరేగింపు కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం పల్లకీ సేవను శాంతినగర్, గురజాడ నగర్ పరిసరాల్లో నిర్వహించారు. భక్తులక ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.ఆదినారాయణ, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

అగనంపూడి: ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సాయినాథున్ని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలకరించగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం భజనా కార్యక్రమంతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకట రమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యలక్ష్మి, పంకజ, సూరీడమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ నేత్ర వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండడంతో పాటు నిత్యం వ్యాయామం, పౌష్టికాహారాన్ని తీసుకుని కంటి వ్యాధుల బారినపడకుండా చూసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ధనలక్ష్మి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గత వారం అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో కళ్లద్దాలు అవసరమని గుర్తించిన 34 మంది విద్యార్థులకు గురువారం వాటిని పంపిణీ చేశారు. కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం, వైద్యాధికారులు మహాలక్ష్మి, అనూష, ఉపాధ్యాయులు జి.కుమారస్వామి, మహ్మద్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శ్రీభరత్‌కు సమస్యలను వివరిస్తున్న కార్మిక నాయకులు

కేవీలో ప్రవేశాలను కొనసాగించాలని ఎంపీకి వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రవేశాలను కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌ను ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరారు. గురువారం వారు నగరంలో ఎంపీని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు సెక్షన్లను పెంచి అడ్మిషన్‌ల ప్రక్రియకు కృషి చేయాలని, భవిష్యత్తులో అడ్మిషన్ల విషయంలో ఎటువంటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకున్నారు. ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ తమకు హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. శ్రీభరత్‌ను కలిసిన వారిలో నాయకులు కోగంటి లెనిన్‌బాబు, కొమ్మినేని శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ సభ్యులు ప్రసాద్, కూర్మ, అప్పలరాజు, తారకేశ్ ఉన్నారు.

ఆసియా గోల్ఫ్ పోటీల్లో సత్తా చూపిన అదిత్



అదిత్

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీ వాసి, అంతర్జాతీయ గోల్ఫ్ క్రీడాకారుడు వీరమాచనేని అదిత్ (11) ఆసియా జూనియర్ మాస్టర్స్ గోల్ఫ్ పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 14 నుండి 16 వరకు థాయిలాండ్‌లో జరిగిన అండర్-12 విభాగంలో గోల్ఫ్ ఆడిన అదిత్ అద్భుతమైన ప్రతిభ కనపరిచి విజేతగా నిలిచాడు. గత ఏడాది కూడా థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో అదిత్ విజేతగా నిలిచి అందరి మన్ననలు అందుకున్నాడు. ఈ సందర్భంగా వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావులు మాట్లాడుతూ అదిత్ మరింత శ్రమించి భారతదేశానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

హైకోర్టు బెంచ్ కోరుతూ 23న న్యాయవాదుల సదస్సు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ ఎట్ డోర్ స్టెప్స్ నినాదంతో విశాఖలో హై కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కోర్టుల ఆవరణలోని బార్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో న్యాయవాదుల సదస్సు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల న్యాయవాదులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు డిమాండ్ 1993 నుంచి ఉందని, ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 43 శాతం ఈ ప్రాంతానికి చెందినవేనని పేర్కొన్నారు. ప్రస్తుతం హైకోర్టు ఉన్న విజయవాడ వెళ్లాలంటే 700 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో పాటు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు సంబంధించిన అంశాలను రూపొందించి రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన మంత్రి, కేంద్ర న్యాయశాఖా మంత్రి, రాష్ట్ర గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర ముఖ్యమంత్రి వినతిపత్రాలు సమర్పిస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

అగనంపూడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పాత అగనంపూడి, శ్రీనివాసనగర్, శాంతినగర్, అన్నపూర్ణానగర్, గల్లవానిపాలెం, శనివాడ, జాబిలి హిల్స్, దువ్వాడ, లక్కరాజుపాలెం, యాతపాలెం, శివాజీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండన్నారు.

వేపగుంట: విరాట్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సింహాద్రినగర్, బాలాజీ గార్డెన్స్, దత్తసాయినగర్, ఆర్టీసీ డిపో పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి తమకు సహకరించవలసిందిగా కోరారు.

న్యాయ పోరాటం ఎప్పటికి వృథా కాదు

గాజువాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): న్యాయం అనేది ఏ ఒక్కరి సొంతం కాదని, న్యాయంగా చేసే పోరాటం ఎప్పుడు వృథా కాదని చేపలపాలెం ఎంపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని గురువారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరంగా ఎవరికీ ఎటువంటి వివక్ష, తారతమ్యాలు లేకుండా ప్రజలందరికీ సమ న్యాయం అందించాలన్నదే సామాజిక న్యాయ దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు హేమంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రమించే గుణాన్ని విదార్థులు అలవరుచుకోవాలి



విద్యార్థినులను అభినందిస్తున్న తలశిల బలరామకృష్ణ, తదితరులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో శ్రమించే గుణం, నైపుణ్యం ఉంటే ఏ రంగంలోనైనా సత్ఫలితాలు సాధిస్తారని టీఎస్సార్‌టీబీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక టీఎస్సార్‌టీబీకే కళాశాలలో లీఫార్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 30 మంది విద్యార్థులు పాల్గొనగా, 13 మంది ఎంపికవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులను ఆయన అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు, సుభాషిణి, విజయ, లీఫార్మా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సరిపల్లిలో దుర్గాంబిక పరస



పెందుర్తి: మండలంలోని సరిపల్లి ప్రజల ఆరాధ్య దేవత దుర్గాంబిక పరసను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించరూ..

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జీఎం (హెచ్ఆర్) జి.గాంధీకి ఎస్సీ, ఎస్టీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత కమిటీకి పదవీ కాలం ముగిసిందని, ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. జీఎంను కలిసిన వారిలో నాయకులు సోమినాయుడు, స్వామి, వేణుగోపాల్, రంజిత్, లక్ష్మీప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

మహారాణిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానంలో ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు

తహశీల్దార్లను ఆదేశించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సంబంధించి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తహశీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, తెలుసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతల సమస్య రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సమన్వయంతో ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బ్యాలెట్ పేపర్ తయారీ తదితర అంశాలలో జాగ్రత్తలు తీసుకుంటూ, సాంకేతిక అంశాలలో ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ ముందు రోజు చేరుకున్న సిబ్బందికి వసతి, ప్రతీ పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు వంటివి చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో భవానీశంకర్, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఏఆర్‌వోలు, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

కోలుకుంటున్న నర్సింగ్ విద్యార్థినులు

పెందుర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలంపేటలో గల ఓ నర్సింగ్ కళాశాల హాస్టల్‌లో బుధవారం తీవ్ర అస్వస్థతకు గురైన ఐదుగురు విద్యార్థినులు కోలుకుంటున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పెందుర్తి సీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. సీహెచ్‌సీలోనే అల్లూరి సీతారామ రాజు జిల్లాకు చెందిన విద్యార్థినులు సంధ్య, లలితకుమారి, దివ్య వైద్యం పొందుతున్నారు. ఇక్కడే చికిత్స పొందిన విద్యార్థిని వెన్నెల ఆరోగ్యం కుదుటపడడంతో గురువారం వైద్యులు డిశ్చార్జి చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మాధవి ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగానే ఉందని సీహెచ్‌సీ పర్యవేక్షణాధికారి డాక్టర్ అవంతి తెలిపారు. కాగా కళాశాల ఫేర్‌వెల్ వేడుకల కోసం పెందుర్తిలోని ఓ హోటల్ నుంచి చికెన్ బిరియానీ తెప్పించారని, అది తిన్నాకే తాము అస్వస్థతకు గురయ్యామని నర్సింగ్ విద్యార్థునులు చెబుతున్నారు. ఇదిలావుండగా ఈ కార్యక్రమంలో పాల్గొని చికెన్ బిరాయానీ తిన్న పెందుర్తిలోని మరో నర్సింగ్ కళాశాల మేల్ నర్స్ నంద చౌదరి కూడా డయేరియా లక్షణాలతో సీహెచ్‌సీలో చేరారని, ఆయనకు చికిత్స అందించడంతో ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు డాక్టర్ అవంతి తెలిపారు. నర్సింగ్ కళాశాలలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో అక్కడ చదువుతున్న 120 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుత్, వై.రాంబాబు, సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాస రావు, అరుణ, హరీశ్ పరామర్శించారు. విద్యార్థినులు దేనివల్ల అస్వస్థతకు గురయ్యారో మరింత నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను వైద్యులు ల్యాబ్‌కు పంపారు.



పెందుర్తి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి

» ఎంపీ శ్రీభరత్

బీచ్ రోడ్డు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీభరత్ మాట్లాడుతూ భక్తిభావంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ఇటువంట కార్యక్రమాల వల్ల ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందన్నారు. శ్రీమాన్ అమితా దాస స్వామీజీ మాట్లాడుతూ శ్రీల భక్తి వేదాంత స్వామి ప్రభుపాదల వారికి మహాకుంభమేళాలో అఖారా పరిషత్ 'విశ్వగురు' బిరుదు ప్రదానం చేయడం గొప్ప విషయమన్నారు. శోభాయాత్ర పార్కు హోటల్ నుంచి గోకుల్ పార్కు వరకు ఊరేగింపుగా సాగింది. కార్యకమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు చెందిన శ్రీయదురాజ దాస, రాధా మదన మోహన్ స్వామీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి, శ్రీమాన్ అమితాదాస స్వామీజీ తదితరులు

27న భవిష్య నిధి కార్యాలయంలో 'నిధి ఆప్ కే నికత్'

మురళీనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భవిష్యనిధి (పి.ఎఫ్) ఖాతాదారులకు, ఉద్యోగ యాజమాన్య సంస్థలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న విశాఖ సిటీలోని మర్రిపాలెం పి.ఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో 'మీ వద్దకే పి.ఎఫ్' (నిధి ఆప్ కే నికత్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పి.ఎఫ్.కమిషనర్ సి.ఎస్.పవన్‌కుమార్ జాస్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులకు సంబంధించిన పి.ఎఫ్, పెన్షన్, నగదు బదిలీ (క్లెయిమ్ ట్రాన్స్‌ఫర్) లాంటి సేవలకు సంబంధించి వివరణాత్మక సలహాలు ఇస్తూ, ఇబ్బందులు ఉంటే పరిష్కారానికి అధికారులు తోడ్పాటు అందిస్తారని కమిషనర్ తెలిపారు. 27న పి.ఎఫ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సేవలు అందిస్తారన్నారు. మర్రిపాలెం ఈఎస్ఐ కార్యాలయం, అనకాపల్లి ఈఎస్ఐ కార్యాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐటీడీఏ సమావేశ మందిరాల్లోనూ హాజరు కావచ్చన్నారు. వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, సంస్థలను నడిపే యజమానులు వారి పి.ఎఫ్ ఖాతాల నిర్వహణలో సమస్యల్ని 'నిధి ఆప్ కే నికత్' అని కవర్‌పై రాసి కార్యాలయాల్లో ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమస్యల్ని పోస్టు ద్వారా లేదా ఫోన్ 0891-2558734 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

3 కిలోల లిక్విడ్ గంజాయి పట్టివేత: ఇద్దరి అరెస్టు

మురళీనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఎన్ఏడీ కొత్తరోడ్డు వద్ద గురువారంమూడు కిలోల లిక్విడ్ గంజాయి తరలిస్తున్న పరవాడ శ్యాంకుమార్, మద్ది ఈశ్వర మణికంఠ అనే యువకుల్ని అరెస్టు చేసినట్లు ఎయిర్ పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి గాజువాక వెళ్లే బస్టాప్‌లో వీరు 3 కిలోల గంజాయి ప్యాకెట్లతో చిక్కారన్నారు. ఆ సమయంలో టాస్క్‌ఫోర్స్,ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖ నుంచి బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్నట్లు చెప్పారు. నిందితులపై ఇదివరకే పాత కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులను విచారణ నిమిత్తం స్టేషన్‌కి తరలించామన్నారు.

తిరుమల దర్శనం పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

కంచరపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్వామివారి దర్శనం చేయిస్తానని ప్రజల నుంచి డబ్బు వసూలు చేసిన నిందితుడిని విశాఖపట్నంలోని కంచరపాలెం పోలీసుల సహకారంతో చిత్తూరు పోలీసులు మాధవధార ఈస్ట్ పార్కు సమీపంలో బుధవారం అరెస్టు చేశారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధవధార ఈస్ట్ పార్కు సమీపంలో నివాసం ఉంటున్న పంజా రమణప్రసాద్ (29) అనధికారికంగా ఆన్‌లైన్‌లో బ్రేక్, ప్రత్యేక దర్శనాలు ఇప్పిస్తానని స్లాట్లు బుక్ చేసి పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుపతి పోలీసులు 2021లో ఇతనిపై కేసు నమోదు చేశారు. అయినప్పటికీ అతడు మళ్లీ మోసాలకు పాల్పడడంతో 2022లో మరో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడు తప్పించుకు తిరుగుతున్నాడు. రమణప్రసాద్ విశాఖలో నివాసం ఉంటున్నాడనే సమాచారం మేరకు ఎట్టకేలకు కంచరపాలెం పోలీసుల సహకారంతో చిత్తూరు పోలీసులు నిందితుడిని పట్టుకుని తిరుపతికి తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడ్ని పట్టుకున్న కంచరపాలెం పోలీసులను అభినందించారు.



నిందితుడు రమణప్రసాద్

నగరంలో నకిలీ పోలీస్ హల్‌చల్

మాధవధార, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ నకిలీ పోలీస్ గురువారం హల్‌చల్ చేసిన ఉదంతమిది. మాధవధార ఉడాకాలనీలో ఉన్న ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పోలీస్ గుర్తింపు కార్డు, ఖాకీ డ్రెస్ ధరించి వ్యవహారాలు చక్కబెడుతుండగా ఓ మీడియా ఛానెల్ ప్రతినిధి గుర్తించి పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు ఆ వ్యక్తిని స్టేషన్‌కి తీసుకొచ్చి విచారిస్తున్నారు. అతడిపై కేసు నమోదు చేసి మరింత సమాచారం రాబట్టేందుకు ప్రశ్నిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు బుకీల అరెస్టు

మహారాణిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యువతను క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు చేస్తున్న ఇద్దరు బుకీలను విశాఖ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. గాజువాకకు చెందిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. తక్కువ డబ్బుతో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు చేస్తున్నారని, తమ వద్ద ఉన్న డబ్బంతా ఖాళీ చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు ముఠా సభ్యులను విశాఖ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎవరైనా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్‌రాయుళ్లకు సహకరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. టోల్ ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిందితుడికి ఏడాది జైలు

తగరపువలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎలైట్ అపార్ట్‌మెంటులో గత ఏడాది నవంబరులో నగదు చోరీకి పాల్పడిన నిందితుడికి అరెస్టు చేసినట్టు క్రైం ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొండేయపాలేనికి చెందిన ఎర్నింటి కృష్ణబాబు గత నవంబరులో తగరపువలసలోని ఎలైట్ అపార్ట్‌మెంటులో ప్రవేశించి వత్సవాయి నర్సింహ రాజు ఫ్లాట్ అద్దాలను తొలగించి రూ.లక్ష చోరీ చేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు కృష్ణబాబును అరెస్టు చేశారు. నిందితుడిని గురువారం భీమిలి 16వ కోర్టు మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా ఏడాది జైలు శిక్షను విధించారన్నారు.